ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 302 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | బుధవారం 28 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

## త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది.



## సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలి

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- "సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం
- ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది
- కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

హైదరాబాద్

సింగరేణిలో బొగ్గు స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రసమితి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఆర్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది. - మిగతా3లో

రాష్ట్రంలో రసవత్తరంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోరు

# మోగిన నగారా



## మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్
- 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల
- తక్షణమే రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల కోడ్
- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
- ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం రేపటి నుంచి ఈ నెల 30 వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. వచ్చే నెల 16వ తేదీన కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 52 లక్షల 43 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 130 మున్సిపాలిటీలు ఉంటే వివిధ కారణాలతో 116 మున్సిపాలిటీలలో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. కంట్రోల్ రూం నుంచి ఓటింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదుకు లెక్క చూపవలసి ఉంటుందని స్పష్టం చేశారు.



## యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు ఎందుకు వేలం వేయకూడదు

- రాష్ట్రాలకు సుప్రీం ప్రశ్న
- బాధితులకు పునరావాసం, పరిహారం, చికిత్స వంటి వాటికోసం ఈ ఆస్తిని వాడుకోవచ్చు
- యాసిడ్ దాడి బాధితులకు కనీస పరిహారంగా అందిస్తున్న రూ.3 లక్షలు సరిపోవని వ్యాఖ్య
- ఈ పరిహారం పెంచేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం ఎందుకు వేయకూడదో చెప్పాలని సూచన



## ఆ ఉద్యోగుల గ్రాట్యుటీ గందరగోళానికి తెర

- రూ. 20 లక్షల పరిమితిపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు
- సీపీఎస్ఈ ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపుపై ఏకీకృత మార్గదర్శకాలు విడుదల
- రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితిపై నెలకొన్న గందరగోళానికి తెర
- 2018 మార్చి 29 నుంచి ఈ పరిమితి అన్ని సంస్థలకు తప్పనిసరి
- అంతకుముందు కాలానికి సంస్థల ఆర్థిక స్థోమతే ప్రామాణికం
- 7వ వేతన సంఘం సిఫార్సులు సీపీఎస్ఈ ఉద్యోగులకు వర్తించవని స్పష్టీకరణ



## డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు

- ముగిసిన హల్వా వేడుక...
- బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!
- కేంద్ర బడ్జెట్ 2026-27 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

## మేడారం మహా జాతరకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 4 రోజుల పాటు వన జాతర
- రాష్ట్రం నలుమూలల నుంచి మేడారానికి వస్తున్న భక్తులు
- వన జాతరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- దాదాపు కోటిన్నర మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు



మేడారం

మేడారం మహా జాతరకు సర్వం సిద్ధమైంది. రేపటి నుంచి 4 రోజుల పాటు జరగనున్న వన జాతరకు సర్కార్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి మేడారానికి వాహనాలు వరుస కడుతుండగా, రోజుకు వేలాది మంది ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. రేపు సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల రాకతో మహా జాతర మొదలు కానుంది. - మిగతా3లో



## బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారత మత్స్యకారుల విడుదల

- విశాఖ వాసులు కూడా!
- బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించడంతో గత ఏడాది అక్టోబర్‌లో 23 మంది అరెస్టు
- అరెస్టైన వారిలో 9 మంది విశాఖపట్నం మత్స్యకారులు
- భారీ భద్రతతో మోంగ్లా సీపోర్ట్‌కు తరలింపు

తమ ప్రభుత్వం ప్రజల కోసమే

## పని చేస్తోంది

- ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారు: పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బీఆర్ఎస్ నేతలపై పొంగులేటి ఫైర్
- అధికారం కోల్పోయిన తర్వాత అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని మండిపాటు
- రాబోయే ఏప్రిల్ నెలలో మళ్లీ కొత్త ఇళ్లు మంజూరు చేస్తాం
- ఆ తర్వాత మరో మూడు దఫాలుగా ఇళ్లు మంజూరీ చేస్తాం



## వాడెవడో అర్జెంటినా నుంచి మెస్సీ వస్తే సింగరేణికి ఏం సంబంధం?

- రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం
- మెస్సీ వచ్చినప్పుడు సింగరేణి నుంచి రూ.10 కోట్లు ఖర్చు చేశారని ఆరోపణ
- కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని విమర్శ
- సింగరేణి కార్మికుల కష్టాన్ని మెస్సీ కార్యక్రమానికి ఖర్చు చేశారని మండిపాటు





## ఎన్నికల వేళ భారత్‌పై పాక్ కరెన్సీ దాడి

- ఎన్నికల ముందు దేశంలోకి కోట్ల నకిలీ నోట్లను పంపేందుకు డీ-కంపెనీ కుట్ర
- పాకిస్థాన్‌లో ముద్రించి బంగ్లాదేశ్, నేపాల్ మార్గాల ద్వారా భారత్‌కు తరలింపు
- అసలు నోట్లను పోలిన నాణ్యతతో ప్రింటింగ్.. గుర్తించడం అసాధ్యమని నిపుణుల అంచనా
- పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా సరిహద్దుపై ప్రత్యేక నిఘా.. ఎన్నికలు జరిగే రాష్ట్రాలే లక్ష్యం
- బంగ్లాదేశ్ సముద్ర మార్గం ద్వారా భారీగా కరెన్సీ చేరవేస్తున్నట్లు గుర్తింపు

డీ-కంపెనీ కుట్రపై నిఘా వర్గాల అలర్ట్!

# సంపాదకీయం

## వెనిజులాపై అమెరికా పెత్తనం సాగేనా!

ఒక సర్వసత్తాక దేశం మీద దాడి చేసి ఆ దేశపు అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలనూ కాలరాసిన ట్రంప్ తాను వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడానని చెప్పుకుంటున్నాడు ! మదురో ఒక మాదకద్రవ్య ముఠాకు నాయకుడిగా ఉన్నట్టు, ఆ ముఠాను అరికట్టకపోతే అమెరికా భద్రతకే ముప్పు వాటిల్లనున్నట్టు ప్రచారం చేస్తున్నాడు. కానీ వాస్తవానికి ప్రపంచంలో జరుగుతున్న కొకైన్ వ్యాపారంలో ఉన్న అంతర్జాతీయ ముఠా నెట్‌వర్క్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నది మెక్సికో, కొలంబియా, హొండురాస్, అర్జెంటినా, ఈక్వెడార్ వంటి దేశాల్లోనుండి పని చేస్తున్న మితవాద శక్తులు. ఈ శక్తులకు అమెరికా అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయి. అందులో వెనిజులా దేశంలోని డ్రగ్ మాఫియా వాటా నామమాత్రమే. ఐనా, తక్కిన దేశాలను వదిలిపెట్టి వెనిజులా మీదనే పడ్డాడు ట్రంప్. ఈ దాడికి ప్రధాన కారణం వెనిజులాలో ఉన్న చమురు నిల్వల మీద పెత్తనాన్ని పొందాలని అమెరికా భావించడమే. వెనిజులాతో ప్రారంభించి మొత్తం లాటిన్ అమెరికా దేశాలన్నింటిపైనా తన పెత్తనాన్ని చెలాయించాలని అమెరికా భావిస్తోంది. 1817-1825 మధ్య అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జేమ్స్ మన్రో ఆ కాలంలో ఒక సిద్ధాంతాన్ని ప్రకటించాడు. దానినే మన్రో సిద్ధాంతం అని పిలుస్తారు. దాని ప్రకారం తన దేశ భద్రత, రక్షణ అవసరాల కోసం ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా సైనిక చర్యలతో సహా ఎటువంటి చర్యలకైనా పూనుకునే హక్కు అమెరికాకు ఉంది. చాలా దుర్మార్గమైన ఈ సిద్ధాంతానికి తర్వాత కాలం చెల్లింది. కాని ట్రంప్ శతాబ్దాలక్రితమే తిరస్కరించబడిన ఆ సిద్ధాంతాన్ని మళ్లీ ముందుకు తెచ్చాడు. ఇప్పుడు మన్రో సిద్ధాంతం కాస్తా 'డాన్రో' సిద్ధాంతంగా పేరు మార్చుకుంది. (ట్రంప్ పేరులోని మొదటి భాగం డొనాల్డ్‌లోని డాన్ ను, మన్రో పేరులోని ఒక భాగాన్ని కలిపి డాన్రో చేశారు) అమెరికాకనుకూలంగా తొత్తు మాదిరిగా వ్యవహరించే ప్రభుత్వాన్ని తొలగించి ఆ స్థానంలో చావెజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వెనిజులాలోని చమురు కంపెనీలను జాతీయం చేశాడు. వాటి ద్వారా లభించే ఆదాయాన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయసాగాడు. దానికి ప్రతీకారంగా అమెరికా వెనిజులా మీద ఆంక్షలు ప్రకటించింది. విదేశాల్లో ఉన్న వెనిజులా పెట్టుబడులను స్తంభింపజేసింది. దాంతో వెనిజులా తీవ్ర ఆర్థిక వత్తిడికి లోనైంది. ఆ పరిస్థితుల్లో వెనిజులా చైనా, రష్యా, ఇరాన్ దేశాలతో ఆర్థిక, సైనిక సంబంధాలను బలపరుచుకుంది. తక్కిన లాటిన్ అమెరికా దేశాలకు దగ్గరైంది. ఐనప్పటికీ అమెరికా ఆంక్షలు వెనిజులాను కుంగదీశాయి. గతంలో రోజుకు 3.5 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసిన పరిస్థితి నుండి ఆంక్షల తర్వాత అందులో మూడో వంతు కూడా ఉత్పత్తి చేయలేని స్థితి వచ్చింది. ఇదే అదనుగా భావించిన ట్రంప్ మదురో దంపతుల కిడ్నాప్‌కూ పూనుకున్నాడు. వారిని అడ్డం పెట్టుకుని వెనిజులాలోని చమురు కంపెనీల మీద మళ్లీ పెత్తనాన్ని పొందాలని భావిస్తున్నాడు. అందుకు వీలుగా వెనిజులాలో తన తొత్తుగా వ్యవహరించే మారియా కొరినా మచాడోను గద్దె మీద కూర్చోబెట్టదలిచాడు. కానీ వెనిజులాలోని ప్రజాభిప్రాయం అందుకు బాగా వ్యతిరేకంగా ఉంది. మదురోతోబాటు ఉపాధ్యక్షురాలిగా పని చేసిన డెల్సీ రోడ్రిగజ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు ఇప్పుడు నిర్వహిస్తున్నారు, తామంతా మదురోతోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు అమెరికా ఎలా వ్యవహరించబోతోంది అన్నది చూడాలి. వెనిజులాలో చమురు నిల్వల మీద పట్టు ఒకవేళ అమెరికా సంపాదించినా, మళ్లీ అక్కడ చమురు ఉత్పత్తిని పాత స్థాయికి తీసుకురావాలంటే 18000 నుండి 20000 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వెంటనే అవసరం. కాని అమెరికన్ చమురు కంపెనీల మొత్తం పెట్టుబడులే 41,300 కోట్ల డాలర్లు. అదీ గాక, ఒకసారి జాతీయం అయిన చమురు కంపెనీల నుండి తాము పొందుతున్న ప్రయోజనాలను చవిచూసిన వెనిజులా ప్రజలు తమ చమురు కంపెనీలను అమెరికాకు కట్టబెట్టడానికి అంగీకరించే పరిస్థితిలో లేరు. ఇంకో పక్క చైనా కూడా వెనిజులాలో భారీగానే పెట్టుబడులు పెట్టింది. మదురోను కిడ్నాప్ చేసిన వెంటనే చైనా, రష్యా వెనిజులాకు, మదురోకు తమ మద్దతు ప్రకటించాయి. అందుచేత వెనిజులా విషయంలో అమెరికాదే ఇష్టారాజ్యంగా చెలామణీ అవుతుందని భావించలేం. కేవలం చమురు నిల్వల మీద పట్టు కోసమే అమెరికా ఇదంతా చేస్తోందని అనుకోలేం. దాని ప్రధాన లక్ష్యం తన ప్రపంచాధిపత్యాన్ని సవాలు చేస్తున్న చైనాను నిలువరించడం. చాలా లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఇప్పుడు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. లాటిన్ అమెరికాలోని 22 దేశాలు చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌లో చేరాయి. చైనా వెనిజులా నుంచి చమురు దిగుమతులను డాలర్లలో కాకుండా యువాన్లలో చేసుకుంటోంది. చాలా లాటిన్ అమెరికా దేశాల్లో మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు పెట్టింది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌తో పని లేకుండా వుండే విధంగా క్రాస్ బోర్డర్ ఇంటర్ బ్యాంక్ పేమెంట్ సిస్టం పేరుతో ఆర్థిక లావాదేవీల వ్యవస్థను చైనా ప్రవేశపెట్టింది. ఈ ప్రయత్నాలన్నీ అంతిమంగా తన డాలర్ ఆధిపత్యానికి సవాలుగా మారుతాయని అమెరికా ఆందోళన చెందుతోంది. తన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదం ఆచరణలో ముందుకు అడుగు వేయలేకపోతోందని ట్రంప్ గ్రహిస్తున్నాడు. మూడవ ప్రపంచ దేశాలనుండి సరుకుల ఉత్పత్తి రంగాలు అమెరికాకు తరలిరావడానికి సిద్ధంగా లేవు. అమెరికాలో ఉత్పత్తి ఖర్చులు చాలా ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఏకధృవ ప్రపంచం అనే వాతావరణం ఇప్పుడు లేదు. డాలర్ ఆధిపత్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థను మొత్తంగానే తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. సామ్రాజ్యవాద ఆధిపత్యం, దానికి మొనగాడి స్థానంలో ఉన్న అమెరికా పరిస్థితి పెను సవాళ్లనెదుర్కొంటున్నాయి. చేజారిపోతున్న తన ఆధిపత్యాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని అమెరికా ప్రయత్నిస్తున్నప్పటికీ, అందుకు ప్రతికూల దిశలో పనిచేస్తున్న శక్తులూ బలంగానే ఉన్నాయి. అమెరికా, సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యంతో గత 35 సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రపంచీకరణ క్రమం మూడవ ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసింది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని బలంగా సవాలు చేస్తున్న శక్తులున్న ఈ తరుణంలో మూడవ ప్రపంచ దేశాలు, ముఖ్యంగా భారతదేశం తమ సార్వభౌమాధికారాన్ని తిరిగి బలంగా నిలబెట్టడానికి ఇదే మంచి తరుణం. కాని, మోడీ ప్రభుత్వం దురహంకారపూరిత సంకుచిత జాతీయవాదంతో వ్యవహరిస్తూ మరోపక్క అమెరికా అడుగులకు మడుగులొత్తుతోంది. దేశ విశాల ప్రయోజనాలు దీనివలన దెబ్బ తిన్నా తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. అందుచేత ప్రగతిశీల


# సమ్మక్క సారలమ్మలకు సబ్బినాటితో అనుబంధం



దేశ మాతృ గౌరవాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా విడిచి పెట్టిన అమర వీరులను ఆరాధించే సత్సంప్రదాయం హైందవ సంస్కృతిలో ఉంది. సమున్నత ఆశయ సాధనకోసం జీవితాలను త్యాగం చేసిన సమ్మక్క, సారలమ్మలను దైవాంశ సంభూతులుగా ఉత్తర తెలంగాణ జాన పదులు ఆరాధ్య దైవాలుగా కొలవడం సదాచారంగా మారింది. దాదాపు 900 సంవత్సరాల చారిత్రక నేపథ్యం కలిగిన వన దేవతల జాతర పూర్తిగా గిరిజన సాంప్రదాయంలోనే సాగుతుంది. అయితే గిరిజనులే కాక, గిరిజనే తరులు సైతం గద్దెలెక్కిన దేవతల ను కొలవడం వంశపారం పర్య ఆచరణగా కొనసాగుతున్నది. కాకతీయులు మొదట సబ్బినాడు (కరీంనగర్) లోనే రాజ్యము చేసి, చాళు క్యుల దయచే అనుమ కొండను సంపాదించారనే భావనకు, ప్రస్తుత జగిత్యాల జిల్లాలోని పొలవాసలో ఏకశిలాదేవి కాకతీ యుల కులదైవం మందిరం ఆనాడు ఉండడం ఊతమిస్తున్నది. కాకతీయులలో మూడవ రాజైన రెండవ బేతరాజు, మహా మండలే శ్వర మేడరాజుకు సామంతుడని శాసనాధారులున్నాయి. జగిత్యాల జిల్లాలో ఆర్వెల్లి (ఆరువేల గ్రామం)లో నేటికీ ఎత్తైన ఆర్వెల్లి నాయకమ్మ విగ్రహం కలిగి, ఏటా జాతర జరుగు తున్నది. బేతరాజు సబ్బి సహస్రం (ఆరువేల నాడు)ను పాలించాడని చరిత్రకారుల భావన. బేతరాజు తర్వాత రెండవ ప్రోల రాజు రాజై, జగిత్యాల సమీప పొల వాస రాజ్యాన్ని ఏలే మేడరాజును గెల్చి, సామంతునిగా నిలిపాడని, అలాగే మంత్రకూటపు (మంథెన) రాజైన గుండె రాజును గుండారం వద్ద ఓడించి, అవమాన పరిచాడని, గుండెరాజు, మేడరాజు అన్నదమ్ము లని పరిశోధనలు జరిగాయి. ప్రోలుని తర్వాత రాజైన కాకతీయ రుద్రుడు నగునూరుపై దండెత్తి దొమ్మ రాజును ఓడించాక, పొలవాసపై దండెత్తగా, మేడరాజు పారిపోగా, హుస్నాబాద్ సమీప ఆకునూరుకు చేరుకుని, మూల సైనిక బలంతో మైళగి దేవుని కళ్యాణి వరకు తరిమిన క్రమంలో, రుద్రరాజు స్వతంత్రుడైన సందర్భం లో, యావదాంధ్రదేశం రుద్రుని పాలన కిందకు 1162లో వచ్చినట్లు చరిత్రకారులు తెలుగు ప్రజలందరిని ఒక్కటిగా చేసిన సంవత్సరం గా గుర్తించారు. మేడరాజు తమ్ముడగు ఏడెరాజు వేయించిన శాసనం రామగుండం వద్ద లభించుటచే ఏడెరాజు ఆప్రాంత సామంతుడుగా ఉండినట్లు అభి ప్రాయాలున్నాయి. గణపతి దేవుని కాలాన కరీంనగర్ జిల్లా మొత్తం సామంత పల్లవుల పాలనలో ఉండెనని తెలుస్తున్నది. గణపతి దేవుని తర్వాత రుద్రమ సింహాస నమెక్కింది. కాకతీయు లలో చివరివాడు ప్రతాప రుద్రుడు. స్థానిక కథనాల ప్రకారం పొలవాస ను పాలించిన మేడరాజు ఏకైక పుత్రిక సమ్మక్కను తన మేనల్లుడైన మేడారం పాలకుడగు పగిడిద్దరాజు తో వివాహం జరిపించాడు. వారికి సారలమ్మ నాగులమ్మ, జంపన్న అనే సంతానం కలిగారు. ప్రతాప రుద్రుడు పొలవాసపై దండెత్తగా, మేడరాజు పోరిపోయి, పగిడిద్ద రాజుకు ఆశ్రయుడైనట్లు, పడిగిద్ద రాజుపై ఆగ్రహించిన ప్రతాప రుద్రుడు మాఘ పౌర్ణమినాడు మేడారం పై దండెత్తినట్లు, మేడ రాజు, పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజు యుద్ధం లో వీరస్వర్గం పొందినట్లు, సమ్మక్క సైతం కాకతీయలతో వీరోచితంగా పోరుసల్పి, గిరిజన యుద్ధ తంత్రా న్ని ప్రదర్శించినట్లు ప్రచారంలో ఉంది. సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్పు తిప్పలు పెడుతుంది, వీరోచితంగా పోరాటం సాగించింది. గిరిజన మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాప రుద్రుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. చివరికి శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుక గుట్ట వైపు వెళుతూ మార్గ మధ్యంలోనే అదృశ్యమైంది. సమ్మక్కను వెదుక్కుంటూ వెళ్లిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు, కానీ ఆ ప్రాంతములో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల భరిణె లభించింది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి రెండేళ్లకు ఒకసారి పెద్ద జాతర, అలాగే మినీ జాతర మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కుంటున్నారు. అవిభక్త కరీంనగర్ జిల్లాతో విడదీయరాని అను బంధం, సంబంధం కలిగిన సమ్మక్క - సారలమ్మలకు అత్యధికంగా వనదేవతల గద్దెలున్నాయి. దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ అయినవి కరీంనగర్ జిల్లాలో 41 కాగా, వరంగల్ జిల్లాలో 12 ఉన్నాయి. ఆదిలాబాద్ లో వేళ్ళపై లెక్కించేవి కాగా, ఇతర జిల్లాలలో బహుస్వల్పం. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జనవరి 28 నుండి 31 వరకు నిర్వహించేందుకు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ఘనంగా జరగనుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సమ్మక్క- సారలమ్మ మేడారం జాతరలో భాగంగా నాలుగు రోజులపాటు వివిధ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించ నున్నారు. నాలుగు రోజులలో ఏరోజు ప్రత్యేకత ఆ రోజుకు ఉంది. ఉత్తర తెలంగాణ నుండి అధిక సంఖ్యాకులైన భక్తులు ఈ జాతరకు సనాతన సంప్రదాయ వారసత్వ ఆచారంలో భాగంగా క్రమం తప్పకుండా వెళ్లడం పరిపాటి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. జనవరి 28 నుంచి 31 వరకు జాతర నాలుగు రోజుల పాటు జరుగుతుంది. తొలి రోజు జనవరి 28న సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి సారలమ్మను, గోవింద రాజు, పగిడిద్ద రాజులను గద్దెపైకి తీసుకు రావడంతో జాతర ప్రారంభం అవుతుంది. రెండో రోజు 29న సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకొస్తారు. 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

# దళిత సాహిత్యోద్యమ రథసారథి

పత్రికా పాఠకులకు సుపరిచితులు డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. జీవితాంతం నిజాయితీ బాట లోనే నడిచారు. నిబద్ధతకు మారుపేరు గా నిలిచారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం సుధాకర్ కే సొంతం. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్ లోని పాముల బస్తిలో తన అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్యు లు, తెలుగు అకాడమీ సభ్యు లు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకులు. హైదరాబాద్ విశ్వ విద్యా లయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తిలో దేవయ్య, శాంతా బాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం .ఏ . ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పిహెచ్ .డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యా లయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు. 1990 అక్టోబరు 6 వ తేది నుంచి వివిధ పదవుల్ని నిర్వ హించారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచు రించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహి త్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించారు. జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి...వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ




క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిల పరచు కొన్నారు. నేటికి ఆయనను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఆయన బాటలో పయనిస్తున్న వారు ఎందరో కవులు ఉన్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా అతి సామాన్య జీవితం గడపడం లాంటి ప్రత్యేకతలు ఆయనకే చెందుతాయని ఆయన తో పరిచయమున్న వారు చెపుతా రు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం, భావుకత లాంటి బహుముఖీన ప్రజ్ఞ సుధాకర్ లోనే కనబడుతుంది అంటే అతిశయోక్తి కాదు. దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సహ దర్మచారిణి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, వారి కూతురు ఎండ్లూరి మానస కథా రచయిత్రి, ఆమె రాసిన కథా సంపుటి "మిళినీద" కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. లలిత కళా పరిషత్ పురస్కారం, నల్గొండ, స్లిష్టల వెంకటల్లు దీక్షితులు స్మారక సాంస్కృతిక సాహితీ కళా సమితి , యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్, కవికోకిల జాషువా, తిలక్ అవార్డు, బెంగళూరు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, సమతా రచయితల పురస్కారం అమలాపురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు, డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్ , సినారె పురస్కారం - కరీంనగర్ , నేదురుమల్లి జనార్ధన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాడే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, అద్దంకి, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి ఎన్ రెడ్డి మెమోరియల్ అవార్డు, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, లెక్క లేనన్ని అందు కున్నారు. 28 జనవరి 2022 (శు క్రవారం) తెల్లవారు జామున హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు. 63వ పుట్టిన రోజు తర్వాత వారం రోజుల కే ఈ లోకాన్ని వదిలి వెళతారని ఎవరూ హిస్తారు. సుధాకర్ ఆకస్మిక అకాల మరణం ఆధునిక తెలుగు సాహిత్యానికి తీరని లోటు.

# డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు

కేంద్ర బడ్జెట్ 2026-27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్-ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు.

హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో



సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు**

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్' ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, indiabudget.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఎన్నికల వేళ భారత్‌పై పాక్ కరెన్సీ దాడి

భారత్‌లో ఈ ఏడాది వరుసగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న దావూద్ ఇబ్రహీం సిండికేట్ (డీ-కంపెనీ) భారీ కుట్రకు తెరలేపింది. కోట్లాది రూపాయల విలువైన నకిలీ కరెన్సీని దేశంలోకి చొప్పించేందుకు సిద్ధమవుతోందని భారత నిఘా వర్గాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్థాన్‌లో భారీ ఎత్తున నకిలీ భారత కరెన్సీ నోట్లను ముద్రించి, వాటిని బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి భారత్‌లోకి అక్రమంగా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా ప్రాంతం నకిలీ నోట్ల రవాణాకు ప్రధాన కేంద్రంగా మారినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు గుర్తించారు. బంగ్లాదేశ్ నుంచి పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ మాల్దాకు చేరనుందని, అందుకు స్థానిక నెట్‌వర్క్ సన్నాహాలు చేసుకుంటోందని సమాచారం అందింది. ఈ నకిలీ నోట్లను అత్యంత నాణ్యతతో, అత్యాధు



నిక యంత్రాలపై ముద్రిస్తున్నారని ఫోరెన్సిక్ నిపుణులు చెబుతున్నారు. అసలు నోట్లలో ఉండే వాటర్‌మార్క్‌ను సైతం పక్కాగా రూపొందిస్తుండటంతో, వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే కరెన్సీ ప్రింటింగ్ యంత్రాల ద్వారానే వీటిని ముద్రిస్తున్నట్లు ఏజెన్సీలు బలంగా అనుమానిస్తున్నాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్లామాబాద్ పట్ల ఇటీవల అనుసరిస్తున్న మెతక వైఖరితో, పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు సముద్ర మార్గం ద్వారా నకిలీ నోట్ల రవాణా సులువుగా మారింది. ఇదే మార్గంలో ఆయుధాలు కూడా చేరుతున్నాయని ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో మార్చి నుంచి మే మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో భద్రతా సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారు. ఇదే అదనుగా భావించి, నకిలీ నోట్లను సులభంగా చెలామణి చేయాలని డీ-కంపెనీ ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో, ముఖ్యంగా మాల్దా పరిసరాల్లో నిఘాను తీవ్రతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కరెన్సీ ఒక్కసారి దేశంలోకి ప్రవేశిస్తే అడ్డుకోవడం కష్టమని, అందుకే సరిహద్దుల్లోనే దీన్ని నిరోధించడం కీలకమని వారు పేర్కొన్నారు.

# ఆ ఉద్యోగుల గ్రాట్యుటీ గందరగోళానికి తెర

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, ఏకీకృత మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రాట్యుటీ అర్హత, చెల్లింపు కాలపరిమితులు, రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి ఎప్పటి నుంచి వర్తిస్తుందనే అంశాలపై నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఒక ఆఫీస్ మెమోరాండం విడుదల చేసింది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం-1972కు చేసిన సవరణల నేపథ్యంలో 2017, 2018లో జారీ చేసిన పలు సూచనలను, వివరణలను క్రోడీకరించి ఈ తాజా మార్గదర్శకాలను రూపొందించినట్లు డీపీఈ తెలిపింది. సీపీఎస్ఈలలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, నాన్-ఎగ్జిక్యూటివ్‌లు సహా అందరు ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది.

**2018 మార్చి 29 నుంచి రూ. 20 లక్షలు తప్పనిసరి**

గ్రాట్యుటీ చెల్లింపు చట్టం-1972కు 2018లో సవరణలు చేసి, గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతూ కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2018 మార్చి 29 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం 2018 మార్చి 29 లేదా ఆ తర్వాత ఉద్యోగ



విరమణ చేసిన లేదా గ్రాట్యుటీకి అర్హులైన సీపీఎస్ఈ ఉద్యోగులందరికీ రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి వర్తిస్తుంది. ఇది చట్టబద్ధమైన నిబంధన కాబట్టి, సంస్థల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ఈ మొత్తాన్ని తప్పనిసరిగా చెల్లించాలని డీపీఈ తన మెమోరాండంలో స్పష్టం చేసింది.

**గత కాలానికి వర్తించే నిబంధనలు**

అయితే, 2017 జనవరి 1 నుంచి 2018 మార్చి 28 మధ్య కాలానికి సంబంధించిన గ్రాట్యుటీ చెల్లింపులు ఆయా సంస్థల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ కాలంలో ఐడీఏ పే స్కేల్‌లో వేతన సవరణ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు, నాన్-యూనియనైజ్డ్ సూపర్‌వైజర్లకు వారి సంస్థ ఆర్థిక భారాన్ని మోయగలదా? లేదా? అనే అంశాన్ని బట్టి గ్రాట్యుటీ చెల్లింపులు జరపడానికి అనుమతించారు.

**7వ వేతన సంఘం సిఫార్సులు వర్తించవు**

సీపీఎస్ఈ ఉద్యోగులలో తరచూ తలెత్తే ఒక ముఖ్యమైన అనుమానాన్ని కూడా డీపీఈ నివృత్తి చేసింది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితిని 2016 జనవరి 1 నుంచి రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచారు. అయితే, ఈ పెంపు సీపీఎస్ఈ ఉద్యోగులకు వర్తించదని కేంద్రం తేల్చి చెప్పింది. సీపీఎస్ఈ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని 2016 జనవరి 1 నుంచి క్లెయిమ్ చేసుకోవడానికి వీలులేదని స్పష్టం చేసింది. ఈ ఏకీకృత మార్గదర్శకాలను అన్ని సీపీఎస్ఈలు కచ్చితంగా పాటించేలా చూడాలని, వాటి పరిధిలోని సంస్థలకు ఈ సమాచారాన్ని చేరవేయాలని అన్ని పరిపాలనా మంత్రిత్వ శాఖలను, విభాగాలను డీపీఈ ఆదేశించింది.

# ప్రపంచంలోని అత్యంత కీలక ఇంధన మార్కెట్‌లలో భారత్ ఒకటి

ఇరుదేశాల మధ్య వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా భారత్-కెనడా దేశాలు అడుగులు వేస్తున్నాయి. అందులో భాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభివృద్ధి చెందుతోందని హడ్గసన్ వ్యాఖ్యానించారు. ఇంధన రంగంలో కెనడా సూపర్ పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను, ఎనర్జీ ట్రేడ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడం కోసం ఒట్టావా నుంచి భారత్‌కు ముడి చమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సిద్ధంగా ఉందని టిమ్ హడ్గసన్ తెలిపారు. కెనడా మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మీడియాతో మాట్లాడారు.

ఇరుదేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు, బ్యాటరీ నిల్వ, కీలకమైన ఖనిజాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇంధన పరిశ్రమలో కృత్రిమ మేధస్సు వాడకం వంటి విషయాలపై దృష్టిపెట్టామని చెప్పారు. 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో మన వాటా 30-35 శాతం



పెరుగుతుందని, భారత్ మూడో అతిపెద్ద ఇంధన మార్కెట్‌గా నిలుస్తుందని అన్నారు.

## బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారత మత్స్యకారుల విడుదల



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖకు చెందిన 9 మందితో సహా 23 మంది భారతీయ మత్స్యకారులు బంగ్లాదేశ్ జైలు నుంచి విడుదలయ్యారు. వీరు గత కొంతకాలంగా బాగేర్‌హట్ జైలులో ఉంటున్నారు. జైలు అధికారులు ఈరోజు మధ్యాహ్నం 11 గంటలకు వారిని బంగ్లాదేశ్ కోస్ట్ గార్డుకు అప్పగించారు. ఈ సమయంలో భారత హైకమిషన్, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు, పోలీసులు, జిల్లా పరిపాలన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హాజరయ్యారు. కోస్ట్ గార్డు సిబ్బంది విడుదలైన మత్స్యకారులను భారీ భద్రతతో మోంగ్లా సీపోర్ట్ కు తీసుకువెళ్లారు. గురువారం వారిని బంగ్లాదేశ్-భారత్ సముద్ర సరిహద్దు మధ్యలో ఇండియన్ కోస్ట్ గార్డుకు అప్పగించే అవకాశం ఉంది. అక్టోబర్ 2025లో ఈ మత్స్యకారులు బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించడంతో ఆ దేశ అధికారులు వారిని అరెస్టు చేశారు. రెండు దశల్లో ఈ మత్స్యకారులు అరెస్టయ్యారు. బంగ్లాదేశ్ నావికాదళం మొదటిసారి 14 మందిని, రెండోసారి 9 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది. నాటి నుంచి వీరు బాగేర్‌హట్ జైల్లో ఉన్నారు.

## యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు ఎందుకు వేలం వేయకూడదు



యాసిడ్ దాడి ఘటనల్లో బాధితులకు సాయం అందించేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని ఎందుకు వేలం వేయకూడదో చెప్పాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. బాధితులకు పునరావాసం, పరిహారం, చికిత్స వంటి వాటికోసం ఈ ఆస్తిని వాడుకోవచ్చు కదా అని సుప్రీం కోర్టు సూచించింది. యాసిడ్ దాడిలో గాయపడి, కోలుకున్న షహీన్ మాలిక్ అనే మహిళ 2009లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై స్పందించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. యాసిడ్ దాడి బాధితులకు కనీస పరిహారంగా అందిస్తున్న రూ.3 లక్షలు సరిపోవని వ్యాఖ్యానించింది. ఈ పరిహారం పెంచేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం ఎందుకు వేయకూడదో చెప్పాలని సూచించింది. యాసిడ్ దాడి ఘటనల్లో నిందితులకు అత్యంత కఠినమైన శిక్షలు వేయడం ద్వారా ఈ తరహా నేరాల్ని నియంత్రించాలని కోర్టు అభిప్రాయపడింది. కోర్టు వ్యాఖ్యల ప్రకారం.. ప్రస్తుతం అందిస్తున్న మూడు లక్షల కనీస పరిహారం బాధితుల చికిత్స కోసం సరిపోదు. కొందరికి జీవిత కాల చికిత్స అవసరం. అలాగే పరిహారం, పునరావాసం వంటికి కూడా ఈ డబ్బులు సరిపోవు. అందుకే పరిహారం పెంచాలని, నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం వేసే విషయం గురించి ఆలోచించాలని సూచించింది. ప్రతి బాధితురాలి కేసు వాదించేందుకు హైకోర్టులో టాప్ లాయర్‌ను నియమించాలని కూడా ఆదేశించింది. తాను యాసిడ్ దాడి కేసులో 16 ఏళ్లుగా పోరాడుతున్నానని, తనకు న్యాయం జరగలేదని, నిందితులంతా కింది కోర్టుల్లోనే విడుదలయ్యారని బాధితురాలు కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఈ పోరాటంలో తాను జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని కోల్పోయానని చెప్పింది. దీనిపై స్పందించిన కోర్టు తాజా సూచనలు చేసింది. అలాగే వివిధ రాష్ట్రాల్లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలు, బాధితుల వివరాలు, నిందితులకు పడ్డ శిక్ష వంటి వివరాలు సమర్పించాలని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది.

## భారత్ ఒక వరల్డ్ పవర్... రిపబ్లిక్ డే సందేశం పంపించిన పుతిన్

**77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్‌కు పుతిన్ శుభాకాంక్షలు**

**ప్రపంచ అగ్రశ్రేణి శక్తుల్లో భారత్‌కు సరైన స్థానం ఉందని వ్యాఖ్య**

**గతేడాది డిసెంబర్‌లో మోదీతో భేటీని గుర్తు చేసుకున్న రష్యా అధ్యక్షుడు**

**ఇరు దేశాల బంధం న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచానికి దోహదపడుతుందన్న ఆశాభావం**

**భారత్-రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తామని ధీమా**

భారత్ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌కు విశేష గౌరవం ఉందని, ప్రపంచంలోని అగ్రగామి శక్తులలో భారత్ సముచిత స్థానాన్ని ఆక్రమించిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన పంపిన సందేశంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రశంసించారు. "సామాజిక, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశం సాధించిన విజయాలను ప్రపంచం గుర్తిస్తోంది. ప్రపంచ అగ్రశ్రేణి శక్తులలో భారత్ తన స్థానాన్ని సగర్వంగా నిలబెట్టుకుంది. అంతర్జాతీయ శక్తుల నడుమ అత్యున్నత గౌరవాన్ని సంపాదించుకుంది" అని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 5న తాను భారత పర్యటనకు వచ్చినప్పుడు ప్రధాని మోదీతో జరిపిన ఫలవంతమైన చర్చలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ చర్చలు ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక, విశేషాధికార వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశాయని పుతిన్ అభిప్రాయపడ్డారు. "ఉమ్మడి కృషితో అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని, అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై మన భాగస్వామ్యాన్ని విజయవంతంగా కొనసాగిస్తామని నేను విశ్వసిస్తున్నాను. ఇది రష్యా, భారత ప్రజల ప్రయోజనాలకు పూర్తిగా అనుగుణంగా ఉంటుంది. అలాగే, న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి దోహదం చేస్తుంది" అని పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. మీకు సంపూర్ణ ఆరోగ్యం, ప్రతి విజయం చేకూరాలని, భారత పౌరులందరికీ సుఖసంతోషాలు, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తున్నానని ఆయన ముగించారు. గతేడాది డిసెంబర్‌లో ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ, అధ్యక్షుడు పుతిన్ సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఇరు నేతలు ఆర్థికం, రక్షణ, వాణిజ్యంతో సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. భారత్-రష్యా సంబంధాలు కాలపరీక్షకు నిలిచాయని, తమ స్నేహానికి, భారత్ పట్ల పుతిన్ అచంచలమైన నిబద్ధతకు ధన్యవాదాలు తెలిపారు.

# మోగిన నగారా

**హైదరాబాద్:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు స్టేట్ ఎలక్షన్ కమిషన్ చీఫ్ రాణి కుమిదిని తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. జనవరి 28 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. జనవరి 30 వరకు నామినేషన్లు దాఖలు గడువు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన. ఫిబ్రవరి 3న తుది అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహణ.. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. మున్సిపల్ ఎన్నిక పోలింగ్.. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగనుంది. 52.43 లక్షల మంది ఓటర్లకు గాను 2,996 వార్డుల్లో 8,203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయనున్నారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ మీడియాతో మాట్లాడారు. 'మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. 50 వేల వరకు మాత్రమే నగదు అనుమతి... 50 వేల కంటే ఎక్కువ ఉంటే రసీదు ఉండాలి. వెబ్ కాస్టింగ్ ఉంటుంది.. పటిష్టమైన బందొబస్తు ఉంటుంది. 22వేల మంది పోలీసులు ఎన్నికల నిర్వహణలో పాల్గొంటారు. 1926 సెన్సిటివ్, 13 వందలు అత్యంత క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గుర్తించాం. కమ్యూనల్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు నిర్మల్, బైంసా, బోధన్, నిజామాబాద్‌లు ఉన్నాయి. మేడారం వెళ్లే వాళ్ళను చెకింగ్ నుంచి మినహాయింపు ఉంటుంది' అని తెలిపారు.

**ఎన్నికల సంఘం బిగ్ షాక్.. పార్టీలకు నో టైమ్..**

రాష్ట్రంలో మరో ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. ఇటీవలే పంచాయతీ ఎన్నికలు ముగియగా.. ఆ హడావుడి తగ్గక ముందే మరో ఎన్నికలకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది. తాజాగా మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈసీ రిలీజ్ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. అయితే, తాజా నోటిఫికేషన్‌తో ఈసీ అన్ని పార్టీలకు బిగ్ షాకిచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే.. అభ్యర్థులను ఖరారు చేసేందుకు కనీస సమయం కూడా ఇవ్వలేదు ఈసీ. రేపటి నుంచే(జనవరి 28వ తేదీ) నామినేషన్ల ప్రకియ ప్రారంభం అవుతుండటం.. కేవలం 3 రోజులు అంటే జనవరి 30 వరకు మాత్రమే నామినేషన్లకు అవకాశం కల్పించడంతో ఆయా పార్టీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఈసీ ఇచ్చిన మూడు రోజుల వ్యవధిలోనే అభ్యర్థులను ఖరారు చేసుకోవడం, వారికి బీఫాం ఇవ్వడం చేయాలంటే ఆయా పార్టీలకు పెద్ద టెన్షన్‌తో కూడిన పనే అని చెప్పాలి. పైగా ప్రచారం చేసే సమయం కూడా పెద్దగా లేదు. ఫిబ్రవరి 11వ తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో ప్రచారానికి కూడా ఎక్కువ సమయం లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2,996 వార్డులకు ఎన్నికలు జరుగనుండగా.. ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు, ప్రధాన పార్టీల నుంచి టికెట్ పొందేందుకు ఎంతోమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని సమాచారం బయటకు వచ్చినప్పటి నుంచే ఆశావహులు తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తూ వచ్చారు. గ్రౌండ్ లెవల్లో పనులు చేసుకుంటూనే.. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైపోయారు. అయితే, ఆశావహులు ఎంతమంది ఉన్నప్పటికీ.. పార్టీల తరఫున టికెట్ మాత్రం కొందరికే వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అభ్యర్థుల బలాబలాలను పరిశీలించి.. ఎవరైతే గెలవగలరో వారికి మాత్రమే టికెట్ కేటాయిస్తారు. ఈ తతంగం అంతా చేయాలంటే ఖచ్చితంగా టైమ్ పడుతుంది. కానీ, ఈసీ మాత్రం రాజకీయ పార్టీలకు అంత టైమ్ ఇవ్వలేదు. కేవలం మూడు రోజులు మాత్రమే నామినేషన్లకు అవకాశం ఇవ్వడంతో.. ఆయా పార్టీల్లో, ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని ఆశావహులు.. గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వాలని పొలిటికల్ పార్టీలు భావిస్తున్న తరుణంలో.. ఈసీ నోటిఫికేషన్ అందరి నోట్లో వెలక్కాయ పడినట్లుగా మారింది. అభ్యర్థులను ఎలా ఎంపిక చేయాలి.. ఎవరిని ఎంపిక చేయాలి.. టికెట్ ఆశించి భంగపడిన వారిని ఎలా కంట్రోల్ చేయాలా అని ఆయా పార్టీల పెద్దలు సతమతం అవుతున్నారు. అభ్యర్థుల ఎంపికల విషయంలో తొందరపడితే నష్టపోవచ్చనే భయం అన్ని పార్టీల నేతలను వెంటాడుతోంది. అలాగని నిదానంగా ఎంపిక చేయడానికి సమయం కూడా లేదు. దీంతో ముందు నుయ్యి.. ఎనుక గొయ్యి అన్నట్లుగా రాజకీయ పార్టీల పరిస్థితి తయారైంది.

**ఎవరి ధీమా వారిదే..**

పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీనే పై చేయి సాధించింది. పురపాలికల్లోనూ సత్తా చాటాలని భావిస్తోంది. మొత్తానికి మొత్తం కార్పొరేషన్లు కైవసం చేసుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు సైతం ఎక్కువ స్థానాల్లో పాగా వేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఎవరి ప్రయత్నాలు ఎలా ఉన్నా.. ఈసీ ఇచ్చిన షాక్‌ను తట్టుకుని గెలిచి నిలిచే పార్టీ ఏది అనే అంశ అందరిలోనూ ఆసక్తి రేపుతోంది.

# అంత పెద్ద శిక్షా.. ఆవేదనలో ఖమ్మం టీచర్

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ పాఠశాల ఇంగ్లీష్ టీచర్ గౌతమి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వ్యవహారం వివాదాస్పదమైంది. పాఠశాల పనివేళల్లో పాఠాలు చెప్పకుండా.. ప్రైవేటు సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ వీడియోలు తీసినందుకు అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఈ చర్యపై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ మరో వీడియో విడుదల చేశారు. 'నేనేమీ గంజాయి అమ్మలేదు, ఎవరినీ చంపలేదు.. తెలియక చేసిన తప్పుకు ఇంతలా ట్రోలింగ్ చేస్తారా?" అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠినంగా ఉంటామని అధికారులు హెచ్చరించగా.. బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సోషల్ మీడియా మోజులో పడటం సరికాదని నెటిజన్లుఅభిప్రాయపడుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల గదిని సోషల్ మీడియా వేదికగా మార్చుకున్నారనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయురాలు గౌతమి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే కారణంతో విద్యాశాఖ అధికారుల నుంచి కఠిన చర్యలు ఎదుర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవారు ఎలాంటి ప్రైవేటు వ్యాపార ప్రకటనల్లో నటించకూడదు. కానీ.. గౌతమి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పలు ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ రీల్స్ చేశారనే ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా పాఠశాల పని వేళల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సోషల్ మీడియా పనుల్లో నిమగ్నమవ్వడంపై ఉన్నతాధికారులు గతంలోనే ఆమెను హెచ్చరించారు. అయినప్పటికీ ఆమె తీరులో మార్పు రాకపోవడంతో.. విధి నిర్వహణలో క్రమశిక్షణారాహిత్యం కింద ఆమెను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.సస్పెన్షన్ వార్త బయటకు వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న విపరీతమైన ట్రోలింగ్‌పై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాజాగా ఆమె మరో వీడియో విడుదల చేస్తూ తన గోడు వెళ్లబోసుకున్నారు. 'నేనేమైనా గంజాయి విక్రయించానా..? లేక ఎవరినైనా హత్య చేశానా..? కేవలం తెలియక చేసిన చిన్న తప్పుకే నన్ను ఇంతలా అవమానిస్తారా..? అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనపై వస్తున్న విమర్శలను తట్టుకోలేకపోతున్నానని.. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన తప్పును క్షమించి తనకు మరో అవకాశం ఇవ్వాలని ఆమె అధికారులను వేడుకున్నారు. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ విధులను గాలికి వదిలేయడం తప్పని కొందరు అంటుంటే.. ఆమె ఆవేదనను గమనించి మానవతా దృక్పథంతో క్షమించాలని మరికొందరు కోరుతున్నారు. ఏదేమైనా.. విద్యావ్యవస్థలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు సామాజిక మాధ్యమాల వినియోగంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఘటన ఒక పాఠంగా నిలిచింది.

# మేడారంలో బస్ స్టాండ్

**వరంగల్ :** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మిస్తామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ప్రకటించారు. జాతర కోసం ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. భక్తుల రద్దీని తట్టుకునేందుకు 4 వేల ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెచ్చారు, ఇవి ప్రయాణికులను నేరుగా గద్దెల సమీపం వరకు తీసుకెళ్తాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం మేడారం బస్సులకు కూడా వర్తిస్తుంది. అదనంగా.. ములుగులో రూ.5 కోట్లతో బస్టాండ్, ఏటూరునాగారంలో రూ.7 కోట్లతో బస్ డిపో నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో పర్యటించిన రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ , పంచాయతీరాజ్ మంత్రి సీతక్క వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల రవాణా సౌకర్యాల కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను వారు ప్రారంభించారు. మేడారం జాతర సమయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ప్రతి ఏటా తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేస్తోంది. అయితే.. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతర కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు.దీనివల్ల ప్రయాణికులు తోపులాట లేకుండా క్రమపద్ధతిలో బస్సుల




కోసం వేచి ఉండవచ్చు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే జాతర కోసం ప్రాథమికంగా 4 వేల బస్సులను కేటాయించారు. భక్తుల రద్దీ పెరిగితే ఈ సంఖ్యను మరింత పెంచుతామని మంత్రి తెలిపారు. సాధారణంగా జాతర సమయంలో వాహనాలను దూరంగా నిలిపివేస్తారు.. కానీ ఆర్టీసీ బస్సులను మాత్రం భక్తుల సౌకర్యార్థం గద్దెల సమీపం వరకు అనుమతిస్తారు.మేడారం పరిసర ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి ములుగులో రూ. 5 కోట్లతో అత్యాధునిక బస్టాండ్‌ను, ఏటూరునాగారంలో రూ. 7 కోట్లతో కొత్త బస్‌డిపోను నిర్మిస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మేడారం జాతరకు వచ్చే మహిళా భక్తులకు కూడా వర్తిస్తుంది. అంటే మహిళలు ఉచితంగా బస్సుల్లో మేడారం చేరుకోవచ్చు. మరోవైపు.. మేడారంలో భక్తులు అమ్మవార్లకు సమర్పించే బెల్లం (బంగారం) విషయంలో కొన్ని ఆంక్షలు అమలులో ఉన్నాయి.గుడుంబా తయారీకి బెల్లం తరలిపోకుండా ఉండాలని ఎక్సైజ్ అధికారులు ఆధార్ కార్డు వివరాలు అడుగుతున్నారు. దీనివల్ల కొన్ని చోట్ల భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత శనివారం ఒక్కరోజే సుమారు 2 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకోవడం జాతర విశిష్టతను చాటుతోంది. ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయం ఈ జాతరపై సమగ్ర పరిశోధన చేయాలని నిర్ణయించింది.

## మేడారం మహా జాతరకు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

కోటిన్నరకు పైగా భక్తులు వస్తారనే అంచనాలతో సర్కార్ సకల ఏర్పాట్లు చేసింది.

**రేపటి నుంచి మొదలు**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర ప్రారంభమైంది. ఆదివాసీ కుంభమేళాగా పిలుచుకునే మేడారం మహా జాతర రేపటి నుంచి అంగరంగ వైభవంగా జరగనుంది. బుధవారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల రాకతో మహాజాతర మొదలు కానుంది. ఆ తర్వాతి రోజు సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరనుంది. దీంతో వన దేవతలతో నిండుజాతర ఆవిష్కృతం కానుంది.

**వివిధ రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తులు**

మహా జాతరకు నెల రోజుల ముందు నుంచే భక్తుల రద్దీ మొదలైంది. పల్లె, పట్నం తేడా లేకుండా వాహనాలు మేడారానికి వరుస కడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఛత్తీసగఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున వన దేవతల చెంతకు చేరుతున్నారు. వారాంతాల్లో 8 నుంచి 10 లక్షల మంది భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరించి నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తున్నారు. ఇక గద్దెలపైకి తల్లులు వచ్చేనాటికి ఊళ్లకు ఊళ్లే మేడారానికి తరలి వెళ్లనున్నాయి.

**రూ.251 కోట్లతో జాతర ఏర్పాట్లు**

మేడారం మహా జాతరను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం, భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఆలయ అభివృద్ధి, జాతర ఏర్పాట్ల కోసం రూ.251 కోట్లు వ్యయం చేసింది. మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది, మేడారం జాతర విధులు నిర్వహించనున్నారు. మరో 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా సేవలందించనున్నారు. జాతర వేళ భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్‌కు జిల్లా స్థాయి అధికారి ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్‌కు మండల స్థాయి అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్‌టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చర్యలు చేపట్టారు.

**తాగు నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు**

మొబైల్ నెట్‌వర్క్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా 27 శాశ్వత టవర్లతో పాటు 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మతులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం మంచినీటి సరఫరా జరిగేలా మిషన్ భగీరథతో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగునీటి నల్లాలు ఏర్పాటు చేశారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలాచరించే భక్తుల కోసం 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు.

**5,700 టాయిలెట్లు, 5 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు**

జాతరలో ప్రధానమైన పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను ప్రభుత్వం చేసింది. 285 బ్లాకుల్లో 5,700 టాయిలెట్లను సిద్ధం చేసింది. వీటికి అదనంగా మొబైల్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తేనున్నారు. 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 దోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు. మహా జాతర నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ 4 వేల బస్సులను నడుపుతోంది. ఆరోగ్య సేవల కోసం 5 వేల మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది.

## సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలి..

-మొదటిపేజీ తరువాయి

కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావిస్తున్నారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారు. స్కామ్‌ల విషయంలో పాలకుల నుంచి స్పష్టమైన జవాబు లేదు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారు. నిబంధన పెట్టిన 9 నెలల్లో ఎందరు కాంట్రాక్టర్లు సందర్శించారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. రింగ్ మాస్టర్ సృజన్‌రెడ్డి.. సీఎం బావమరిదేనా? కాదా? స్పష్టత ఇవ్వాలి. కాంట్రాక్టర్లను రింగ్ చేసి ప్రజాధనం దోపిడీకి యత్నిస్తున్నారు. ప్రభుత్వం రూ.వేల కోట్లు కొల్లగొడుతోందని సింగరేణి కార్మికులు గుర్తించాలి. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గర్నవర్‌ను కోరాం" అని కేటీఆర్ తెలిపారు.

## తమ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోంది


బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయిన తర్వాత అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తూ, ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రూపొందిన మంచి పథకాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మళ్లీ కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని, ఆ తర్వాత మరో మూడు దఫాలుగా ఇళ్లు మంజూరీ చేస్తామని ప్రకటించారు.

ప్రజలు గతంలో ఏం జరిగిందో గుర్తుంచుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందని స్పష్టం చేశారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరిక మేరకు నియోజకవర్గానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేశానని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు. నియోజకవర్గ కేంద్ర అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆమె అన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, వర్ధన్నపేటలో మూడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పని చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎవరినీ ఎదగనీయకుండా ధృతరాష్ట్రుని పాలన చేశాడని విమర్శించారు. పాలకుర్తిలో ప్రజలు తరిమికొట్టిన తర్వాత ఇప్పుడు వర్ధన్నపేట మునిసిపాలిటీపై అవాకులు, చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు.

## వాడెవడో అర్జెంటినా నుంచి మెస్సీ వస్తే సింగరేణికి ఏం సంబంధం?



సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గత ఏడాది అర్జెంటీనా ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ వస్తే సింగరేణి నుంచి రూ.10 కోట్లు ఖర్చు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి నిధులను గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ దోచుకుంటోందని విమర్శించారు. "ఎవడో ఫుట్‌బాల్ ఆడుతాడట. వాడెవడో మెస్సీ ఇతర దేశాల నుంచి వస్తే నా సింగరేణికి ఏం సంబంధం? అతను వస్తే సింగరేణి నుంచి రూ.10 కోట్లు ఖర్చు పెట్టారు. సింగరేణిలో కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి, పెంచడానికి డబ్బులు లేవు. మెడికల్ రీయింబర్సుమెంట్స్ కోసం డబ్బులు లేవు. కానీ ఎవడో మెస్సీ వస్తే వానికి డబ్బులు ఇస్తాడు. అతనిని ఆడించడం కోసం నా సింగరేణి కార్మికులు కష్టపడి సంపాదించిన డబ్బును అక్కడ ఖర్చు పెట్టాడనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరు అధికారం ఇచ్చారు?" అని ఆయన ప్రశ్నించారు.

ధర్మఘంట

# సూర్యాపేటలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తాం

: రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి,వేణారెడ్డి

ధర్మ ఘంట జనవరి 26,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :

సూర్యాపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు స్వంత ప్రెస్‌క్లబ్ భవనం లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటికి శాశ్వత పరిష్కారంగా పక్కా భవన నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత మున్సిపాలిటీ భవనంలో సూర్యాపేట ప్రెస్‌క్లబ్ కార్యాలయాని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రావు అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి మాట్లాడుతూసమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసేది జర్నలిస్టులేనని కొనియాడారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో మీడియా పాత్ర అమూల్యమన్నారు. గతంలో రామ్‌రెడ్డి దామోదర్‌రెడ్డి జర్నలిస్టుల సమస్యలను గమనించి వారికి గృహనిర్మాణం కోసం ఇంటి స్థలాలు కేటాయించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ స్ఫూర్తితోనే నేడు ప్రెస్‌క్లబ్ భవన




నిర్మాణానికి కూడా అందరి సహకారంతో ముందడుగు వేస్తామన్నారు.జర్నలిస్టులు యూనియన్లకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగితే ప్రెస్‌క్లబ్ నిర్మాణం మరింత వేగంగా సాధ్యమవుతుందని చెప్పారు. వార్తల రచనలో మంచి విషయాలను మంచిగా, చెడును చెడుగా చూపించడం తప్పుకాదని, అయితే సమాజాన్ని నిర్మించే సానుకూల అంశాలను కూడా ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి పది సంవత్సరాల క్రితమే స్థలం కేటాయించామన్నారు. అవసరమైన స్థలం, అనుమతులు, వనరుల సమీకరణలో తమవంతు సహకారం నిరంతరం ఉంటుందని తెలిపారు.



మున్సిపాలిటీ ఎన్నికల ముందు పాత్రికేయులతో మేధోమథనం ఏర్పాటుచేస్తామని మా మానిఫెస్టో ను ప్రజలముందుకు తీసుకెళ్లాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, చకిలం రాజేశ్వరరావు, అంజద్ అలీ, కెక్కిరేని శ్రీనివాస్, పూర్వ విద్యార్థుల మిత్ర మండలి అధ్యక్షులు నల్లగుంట్ల అయోధ్య, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు సుంకరబోయిన వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కందుకూరి యాదగిరి, సీనియర్ జర్నలిస్టులు బంటు కృష్ణ, అయితగాని రాంబాబు, మొయినుద్దీన్, భూపతి రాములు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



ఫోటో: కరపత్రావిష్కరణ చేస్తున్న అధ్యక్షులు

సోషల్ జస్టిస్ వ్యవస్థాపక అధ్యక్షులు దర్శనం నరసింహ

ధర్మ ఘంట జనవరి 26,నల్గొండ:

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని పీపుల్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపక అధ్యక్షులు దర్శనం నరసింహ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీపుల్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి సమాజంతో కలిసి జీవిస్తూ ప్రభావం చూపే పత్రం రాజ్యాంగ పీఠిక స్ఫూర్తి అమలులోకి వచ్చినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం, సమానత్వం సాధ్యమవుతాయని అన్నారు. రాజ్యాంగ పీఠిక స్ఫూర్తిని అమలు చేయాలని కులహింసలు,పరువు హత్యలకు ప్రత్యేక చట్టం తేవాలని భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రిపబ్లిక్ డే సందర్భంగా పీపుల్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిన్ దేశ ప్రజలందరికీ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన మూల సూత్రాలను మరొక్కసారి గుర్తు చేస్తోందన్నారు.సామాజిక,ఆర్థిక,రాజకీయ స్వేచ్ఛ, సమానత్వం,సోదరభావం అనే విలువల ఆధారంగా భారతదేశాన్ని సార్వభౌమాధికార, సామ్యవాద,లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించాలని పీఠిక స్పష్టం చేస్తుందని కానీ నేటి పరిస్థితుల్లో రాజ్యాంగ పీఠిక స్ఫూర్తికి విరుద్ధంగా కులపరమైన దాడులు,పరువు హత్యలు, అంతర కుల ప్రేమపై హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయన్నారు.సామాజిక న్యాయం కోరుకునే ప్రతి పౌరుడు, విద్యావంతులు,న్యాయవాదులు, విద్యార్థులు,సామాజిక కార్యకర్తలు, సామాజిక న్యాయం పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పీపుల్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ తో కలిసి ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ సట్టు నగేష్,జాయింట్ సెక్రటరీ సంకటి యాదగిరి,సభ్యులు ఎర్ర శివకుమార్, మైనం జీవన్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు కట్టెల శివకుమార్, జగన్,మాగే, దున్న.అంగ స్వామి,అంగయ్య గోంతో,యాగగిరి తదితరులు ఉన్నారు.

# బీజేపీ పాలనలో భారత రాజ్యాంగానికి ముప్పు

ధర్మఘంట, జనవరి 26, నల్లగొండ :

77వ గణతంత్ర వేడుకల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని శివాజీ నగర్ టిటిడి కళ్యాణ మండపం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నల్గొండ డిసిసి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసి జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత హాజరై జాతీయ జెండాను ఎగరవేసి, వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు తమను తాము పాలించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థని బలోపేతం చేయడానికి డా. బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగం రచించారని ఆయన కొనియాడారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ దేశంలోని పేదలకు బడుగు బలహీన వర్గాలకు ఆదివాసులకు దళిత మైనారిటీల అభివృద్ధికి చట్టాలు చేసి వారిని బలోపేతానికి కృషి చేశారని ఆయన కొనియాడారు. నేడు కేంద్రంలోని బీజేపీ మోడీ సర్కార్ పేదల సొమ్మును అంబానీ అథానిలకు దోచి పెడుతుందని అన్నారు. నెహ్రూ ఇందిరా మన్మోహన్ సింగ్ ప్రధానుల కాలంలో చేసిన అనేక పథకాల రద్దు వెనుక బీజేపీ కుట్ర దాగి ఉందని అన్నారు. 25 కోట్ల మంది కి ఉపయోగపడే "ఎంజి నరేగా" పథకానికి బీజేపీ తూట్లు పొడిచిందని ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీలకు సంక్రమించిన రాజ్యాంగపరమైన హక్కులను హరించి, భారత రాజ్యాంగానికి పెనుముప్పు వాటిల్లే విధానాలను అవలంబిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2029లో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం తధ్యం అని, 2029లో రాష్ట్రంలో మరోమారు రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసి సెల్ చైర్మన్ జిల్లపల్లి పరమేష్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బోడ స్వామి, బీసీ సంక్షేమ సంఘం దుడుకు లక్ష్మీనారాయణ, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గండూరి నరసింహ, సీనియర్ జిల్లా నాయకులు ఎండి ముంతాజ్ అలీ, కర్నాటి యాదగిరి, గౌతమ్, శివ, నాగార్జున గౌడ్, రవీందర్ రెడ్డి, వేముల గోపీనాథ్, బోడ అరుణ్, లొడంగి మహేష్, శరత్, వినీత్, పగిళ్ల శివ, కౌశిక్, జశ్వంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# దాతలచే విద్యార్థులకు ప్యూరిఫైడ్ వాటర్ సౌకర్యం



40 వేల వాటర్ ప్లాంట్ బహుకరణ

దాతలకు అభినందనలు తెలిపిన ఎంపీపిఎస్ రెడ్లకుంట ప్రధానోపాధ్యాయులు తీగల నరేష్

కోదాడ రూరల్ జనవరి26, ధర్మఘంట:

కోదాడ మండలం రెడ్ల కుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు చిత్తలూరి కోటేశ్వరరావు,పిచ్చయ్య పాల్గొని వారి తండ్రి పేరు మీదుగా రెడ్ల కుంట గ్రామ మాజీ సర్పంచ్ చిత్తలూరి వెంకయ్య జ్ఞాపకార్థం పాఠశాలకు 40 వేల రూపాయలు విలువైన వాటర్ ప్లాంట్ బహుకరణ చేయడం జరిగింది. ఇది విద్యార్థినీ, విద్యార్థుల త్రాగునీటికి ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామ పెద్దలు హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అందుకు సంబంధించిన చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల నరేష్ కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మల్లెల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి ,గ్రామ పెద్దలు గంగవరపు లక్ష్మణరావు, కునుకుంట్ల రవి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రవణ్ కుమార్,రవిచందర్, అరె.బాబు,రవీందర్ రెడ్డి, షేక్ జబ్బార్, బుల్లయ్య, వార్డ్ మెంబర్స్ ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ నంది పురస్కారం అందుకున్న పిల్లి సంజయ్ ఆనంద్



గచ్చిబౌలి: జనవరి 26 ( ధర్మ ఘంట)

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళా నిలయం స్వచ్ఛంద సేవ సొసైటీ వారి ద్వారా స్వర్ణ నంది పురస్కారాన్ని గచ్చిబౌలి కి చెందిన పిల్లి సంజయ్ ఆనంద్ అందుకున్నారు. సరస్వతి ఉపాసకులు శ్రీ దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకోగా,సినీ నటులు గుండు సుదర్శన్ శాలువతో సన్మానించారు.పిల్లి ఆనందరావు, జయశ్రీ దంపతుల కుమారుడైన సంజయ్ ఆనంద్ ఎం బి ఎ విద్యని అభ్యసించి, హైదరాబాద్ లో వ్యాపార వేత్తగా స్థిరపడి గోగ్రీన్ సొసైటీ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేపడుతుంటారు.ముఖ్యంగా గో సంరక్షణ కార్యకర్తగా గోవుల పోషణ కోసం ప్రతి సంవత్సరం అనేక రకాలుగా తన సంపాదనలో కొంత బాగాన్ని గోవుల కోసం కేటాయిస్తారు.గో రక్షణ తో పాటుగా నిరుపేద, అనాధ పిల్లల విద్య కోసం పుస్తకాల పంపిణి మరియు ఆరోగ్య రక్షణ కోసం మందుల ను అందజేస్తారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డు నా భాద్యత నీ మరింత పెంచిందని రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని అన్నారు. ఈ సేవ చేయడానికి కారణం అయినా తల్లి దండ్రులకు ఎప్పటికి రుణపడి ఉంటానని తెలిపారు. తన తండ్రి పెంపకం లో సేవ దృక్పదాన్ని అలవర్చు కొన్నానని గుర్తు చేశారు. ప్రస్తుతం గో గ్రీన్ సొసైటీ కి సంజయ్ ఆనంద్ ప్రెసిడెంట్ గా ఉన్నారు.ఈ కార్యక్రమం లో బ్రాహ్మశ్రీ జోషి మధుసూదన శర్మ, సామాజిక వేత్త చందు ఆంజనేయులు,సొసైటీ సభ్యులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు

## కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు మరోసారి ఉత్తమ సేవా అవార్డు

ధర్మ ఘంట,జనవరి 26,కోదాడ:-



కోదాడ ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణకు మరోసారి ప్రతిష్టాత్మక ఉత్తమ సేవా అవార్డు వరించింది. సోమవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమర్థత, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం, ఎన్నికల నిర్వహణ, భూ పరిపాలన, రెవెన్యూ వ్యవహారాల్లో నిష్పక్షపాత వైఖరితో పనిచేసినందుకు గాను సూర్యనారాయణ సేవలను జిల్లా యంత్రాంగం గుర్తించింది. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు స్పందించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.ఇదే కాకుండా గతంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూడా ఉత్తమ సేవా అవార్డును అందుకున్న సూర్యనారాయణకు ఇది రెండోసారి రావడం విశేషం. వరుసగా అవార్డులు అందుకోవడం ఆయన కర్తవ్యనిష్ఠకు నిదర్శనంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సూర్యనారాయణను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజాసేవలో ముందుండాలని పలువురు ఆకాంక్షించారు.

# నిరుపేదలకు బాసటగా నిలిచిన తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు

ధర్మ ఘంట జనవరి 26 మర్రిగూడ :

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తన స్నేహితులతో సహకారంతో పలువురి నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలిచారు.మండల వ్యాప్తంగా 20 కుటుంబాల అత్యవసర పరిస్థితిని తెలుసుకొని రూ. 2.80వేల ఆర్థిక సాయం అందించారు.తల్లిదండ్రులు లేని చిన్నారుల చదువుల కోసం,ఆసరా లేని నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులకు,ఆరోగ్య బాధితులకు,దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ..వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ నగదును అందజేశారు.ఒకపక్క ప్రభుత్వ బాధ్యతలను నిర్వర్తిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ఆర్థిక సాయం చేస్తున్నారు.ప్రభుత్వ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ,మరోవైపు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేదలు, నిరుపేదలకు ఆర్థిక సాయం చేస్తూ ఆయన మానవత్వానికి చిరునామాగా నిలుస్తున్నారు.ప్రజల సమస్యలను నేరుగా




వింటూ,సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలు చూపడం మాత్రమే కాకుండా,అవసరమైతే తన వంతు సాయాన్ని కూడా అందించడం ఆయన ప్రత్యేకత.ఇది నా బాధ్యత కాదు అనే భావనకు తావు ఇవ్వకుండా ఇది నా మానవత్వం అన్న దృక్పథంతో ముందుకు సాగడం ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతోంది. కడు కష్టాలను ఈ స్థాయికి వచ్చానని వీరికి సేవ చేయడం నాకు సంతృప్తినిస్తోందని తహశీల్దార్ వెల్లడించారు.ప్రజాసేవ అంటే పథకాలు అమలు చేయడమే



కాదు,ప్రజల గుండెల్లో నమ్మకాన్ని నింపడమని మర్రిగూడ తహసీల్దార్ తన పనితీరుతో చాటిచెబుతున్నారు.ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు పలువురు నాయకులు తహశీల్దార్ ను అభినందించి, ఘనంగా సన్మానించారు.ఆర్థిక సాయం అందుకున్న నిరుపేద కుటుంబాలు తహశీల్దార్ శ్రీనివాసు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# మున్సిపల్ ఎన్నికలకు అందరు సిద్ధంగా ఉండాలి





**రాష్ట్రం లో 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు**

**జిల్లాలో 5 మున్సిపాలిటీలకు ఎన్నికలు**

**జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికలకు అందరు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు.రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 116 మున్సిపాలిటీలకు 07 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ లు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు అధికారులు మరియు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది ఎన్నికలు స్వేచ్ఛా, పారదర్శకంగా జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ రెండవ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్లు, ఎస్పీలు మరియు అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయితీ ఎన్నికల లాగే రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛా మరియు పారదర్శకంగా నిర్వహించే విధంగా అన్నిరకాల చర్యలు తీసుకొని అన్ని రకాల ఏర్పాట్లు చేసుకొని మొత్తం అధికార యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే పట్టణ కేంద్రాల్లో జరిగే ఎన్నికలు కావున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల బందోబస్తు చర్యలు తీసుకోవాలని 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైతే అటవీ, ఎక్సైజ్ శాఖల సిబ్బందిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 5 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నట్లు వీటికి మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను మరొకసారి వెరిఫై చేయాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే అధికార యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తుందని అధికారులందరు ఎన్నికల నియమావళి సక్రమంగా పాటించాలని తెలిపారు. మొదట 24,48 మరియు 72 గంటల రిపోర్టులు వెనువెంటనే పంపాలని తెలిపారు. జగిత్యాల జిల్లాలో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులందరు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు తదితర కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి , ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి

## బతికేపల్లిలో ఉపాధిహామీ మహిళా కూలీలతో సమావేశం



**జగిత్యాల :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పునరుద్దరించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి అన్నారు. జగిత్యాలజిల్లాలోని పెగడపల్లి మండలం బతికేపల్లి గ్రామంలో ఉపాధి హామీ వర్కర్స్ తో మంగళవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి అధ్యక్షతన సమావేశం జరుగగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, పెగడపల్లి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సింగసాని విజయలక్ష్మి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శోభారాణి మహిళా కూలీలనుద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. మహాత్మా గాంధీ మన దేశానికి స్వాతంత్రం తెచ్చిన గొప్ప మహనీయుడని ఆమే కొనియాడారు.ఉపాధిహామీ పథకానికి గాంధీ పేరు లేకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తునీదని శోభారాణిలు ఆరోపించారు. ఎంతోకాలంగా దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాల ఫలితంగా ఎంజిఎన్ఆర్ఇజిఎఎస్ రూపుదిద్దుకుందని,ప్రతి చేతికి పని, పనికి తగ్గ వేతనం అనే హామీ ఈ పథకం ద్వారా ప్రజలకు సిద్ధించినీదని శోభారాణి తెలిపారు.గ్రామీణ భారతంలో పని కోరుకునే వారికి చట్టబద్ధమైన హక్కును కల్పించిందని ఆమే గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా 100 రోజులు ఉపాధికి కూలీలకు భరోసా కల్పిస్తూ హామీ ఇచ్చిందని, వికేంద్రీకృత పాలనను బలోపేతం చేసిందని శోభారాణి ఉద్ఘాటించారు. మహిళలు, భూమిలేని నీరుపేదలను శక్తివంతం చేసిందని ఆమే కొనియాడారు. ఇంతటి మహోన్నత పథకానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు పెడితే ఓర్వలేని బిజెపి ప్రభుత్వం, అయన పేరును తొలగించాలని నిర్ణయం తీసుకొని, గాంధీజీ పేరు మార్పు, విలువల పట్ల ఉన్న దీర్ఘకాల అసౌకర్యాన్ని ఆ నమ్మకాన్ని ప్రతిబింబించేలా చేస్తుందని శోభారాణి ఆరోపించారు.ప్రజాకేంద్రిత సంక్షేమ చట్టంతో జాతిపితకు ఉన్న అనుబంధాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆమె దుయ్యాబట్టారు.కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడానికి బిల్లులను ప్రవేశ పెట్టడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు.ఉద్దేశ పూర్వకమైన అడుగు వేసింది చరిత్రత్మకమైన హక్కుల ఆధారిత ప్రజల చట్టాన్ని బలహీనపరచడం భారతదేశంలో అత్యంత గుర్తింపు పొందిన సంక్షేమ చట్టం నుండి మహాత్మా గాంధీ పేరు విలువలను తొలగించేందుకు చేసిన రాజకీయ కుట్ర అని ఆమె విమర్శించారు.అనాలోచిత నిర్ణయాలతో కేంద్రం వ్యవహరించడం ప్రజా వ్యతిరేకమని శోభారాణి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ పక్షాన కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని శోభారాణి డిమాండ్ చేశారు. తదుపరి మహిళలతో మాట్లాడి కేంద్రం కుట్ర పూరిత ధోరణి వివరించి, కూలీల ఇబ్బంది, సమస్యలను శోభారాణి, విజయలక్ష్మి లు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బతికేపల్లి సర్పంచ్ ముంజ మహేశ్వరి మధుకర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు సింగసాని విజయలక్ష్మి, మహిళల పాల్గొన్నారు.

# ఒక తల్లి చెప్పే మాటే కుటుంబ ప్రాణాలకు కవచం



**వనపర్తి :** రోడ్డు ప్రమాదాల నివారణలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని వనపర్తి జిల్లా సునిత రెడ్డి,, అన్నారు. పెద్దమందడి జనవరి -27 రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అలైవ్ ? అరైవ్" కార్యక్రమంలో భాగంగా 10వ రోజు మంగళవారం ఉదయం పెద్దమందడి మండల కేంద్రంలోని రైతువేదికలో, అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలు, పాత్రికేయులు, పోలీసులకు హెల్మెట్ ప్రాముఖ్యత మరియు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ వారి సహకారంతో 65 హెల్మెట్లను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, మహిళలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కుటుంబంలో పిల్లలు, భర్తలు, అన్నదమ్ములు సురక్షితంగా ఇంటికి చేరాలంటే మహిళలు వారికి హెల్మెట్ వినియోగంపై నిరంతరం గుర్తుచేయాలన్నారు.హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాకుండా, కుటుంబ ఆనందాన్ని కాపాడే భద్రతా కవచమని మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామస్థాయిలో రోడ్డు భద్రత సందేశాన్ని విస్తరించాలని, తమ కుటుంబాలతో పాటు సమాజాన్ని కూడా ప్రమాదాల నుంచి రక్షించాలన్నారు.అమ్మ మాటలోనే భద్రత ఉంది భార్య సూచనలోనే భర్త జీవితం ఉంది పిల్లల చిరునవ్వుల కోసం హెల్మెట్ తప్పనిసరని హెల్మెట్ ధరించమని అడగడం హెల్మెంట్ ధరించకుండా వెళ్లనివ్వడం ప్రమాదమని. రెండు చక్రాల వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా కుటుంబ ప్రాణాలను కాపాడే భద్రతా కవచమని అన్నారు.మహిళలు తమ భర్తలు, పిల్లలు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపకుండా కచ్చితంగా గుర్తుచేయాలని, అదే నిజమైన కుటుంబ బాధ్యతని భర్త బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ఉందా అని అడగడం భార్య ప్రేమ?పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం తల్లి బాధ్యతని హెల్మెట్ ధరించమని చెప్పడం ఒక మాట కాదు కుటుంబాన్ని ప్రమాదాల నుంచి కాపాడే భద్రతని ఎస్పీ అన్నారు.

## ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలి

### బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్

**జోగులాంబ గద్వాల :** గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలని మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. గద్వాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై మండిపడ్డారు.గద్వాల పట్టణంలో ఎవరికి ఓటు అడిగే హక్కు లేదని, ఎవరు ఏమి అభివృద్ధి చేశారో పట్టణ ప్రజలకు తెలుసని అన్నారు. తెలంగాణ స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రకారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో ఆ పార్టీ కండువా కప్పుకుని ఎన్నికల్లో తిరగాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు.స్పీకర్ నిర్ణయాన్ని ఎమ్మెల్యే బండ్ల గౌరవించాలన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యే బండ్ల ఇప్పుడున్నది కాంగ్రెస్ పార్టీలోనని గద్వాల ప్రజలందరికీ తెలుసు. తాను కాంగ్రెస్‌లో ఉన్నా అని చెబితే.. కాంగ్రెస్ కండువా వేసుకొని తిరిగితే ఎమ్మెల్యే పదవి ఊడిపోతదని ఎమ్మెల్యే బండ్ల ఏదో అబద్దాలు చెప్పుకుంటూ తిరుగుతున్నరన్నారు. ఆయన ఏ మొహం పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేస్తారన్నారని ప్రశ్నించారు.ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ పాట పాడటం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికే సొంతమని డీకే అరుణ అన్నారు. గద్వాల పట్టణ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, పట్టణ ప్రజలు గద్వాల అభివృద్ధి కావాలంటే బీజేపీకి పట్టం కట్టాలని డీకే అరుణ కోరారు.

## టీవీ ఛానెల్ డిబేట్‌లో జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలి

### శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ ఫిర్యాదు

**హైదరాబాద్ :** టీవీ ఛానెల్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అయిన సిరికొండ మధుసూధనాచారి నేతృత్వంలో.. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఛైర్మన్ కలిశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ తన ఫిర్యాదును ఛైర్మన్‌కు అందజేశారు. ఏబీఎన్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఇటీవల ఏబీఎన్‌లో జరిగిన ఓ డిబేట్ సందర్భంగా రవీందర్ రావును గెట్‌అవుట్ అంటూ అవమానించారు. దీనిపై ఆయన ఫిర్యాదు చేశారు.తక్కళ్లపల్లి రవీందర్ రావుతోపాటు వెళ్లి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతల్లో దేశపతి శ్రీనివాస్, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నవీన్‌రెడ్డి ఉన్నారు.

## మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహించేందుకు నోడల్ అధికారులు

**సిద్దిపేట :** హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ మున్సిపాలిటీలకు నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి-జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మున్సిపల్ ఎన్నికలలో అధికారులు అంకితభవంతో పనిచేసి ఎలాంటి తప్పులకు తావు లేకుండా మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి కలెక్టరేట్ లో మున్సిపల్ ఎన్నికల జిల్లా నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ. ఎన్నికల నిర్వహణలో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు తదితర కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ఎలాంటి పొరపాటుకు తావులేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జడ్పీసీఈఓ రమేష్, డిపిఆర్ఓ రవికుమార్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, డివిజనల్ పంచాయతీ అధికారి, సహకార అధికారి నాగేశ్వరరావు, ఎన్నికల శిక్షణ అధికారులు అయోధ్య రెడ్డి, రామస్వామి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ



**జగిత్యాల :** జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ లో మేడారం మహా జాతర పోస్టర్ ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆవిష్కరించారు. సమ్మక్క, సారలమ్మ వన దేవతల మేడారం మహా జాతర జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న నేపథ్యంలో దర్శనాలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.జిల్లా నుండి ఆర్.టి.సి బస్ లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.వన దేవతల దర్శనాలకు వెళ్లే భక్తులు జాగ్రత్తగా వెళ్లి భక్తి శ్రద్ధలతో దేవతల కృప పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి కె. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ టీచర్లకు ఈఎల్సి మంజూరు చేయాలి

### డీఈఓకు తపస్ నేతల వినతి



**జగిత్యాల :** ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో పాల్గొన్న వారికి ఈఎల్సి మంజూరు చేయాలనీ తపస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ప్రసాద్ రావు కోరారు.మంగళవారం జగిత్యాల జిల్లా విద్యాధికారికీ తపస్ నేతలు ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ రావు, రాజేష్ లు మాట్లాడుతూ2025 వేసవి సెలవుల్లో ప్రభుత్వం జగిత్యాల జిల్లా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించిందని వారు తెలిపారు.అయితే శిక్షణలో పాల్గొన్న టీచర్లందరికి ఈఎల్సి మంజూరు చేయాలనీ, ఇట్టి విషయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు చేయాలనీ తపస్ నేతలు డీఈఓ ను కోరారు.ఈకార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు రఘునందన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### పీఎం ఈ-డ్రైవ్ సబ్సిడీ పొడిగించాలని కోరుతున్న ఈవీ టూ-వీలర్ కంపెనీల



దేశీయ ఎలక్ట్రిక్ టూవీలర్ తయారీ కంపెనీలు కేంద్ర ప్రభుత్వం ముందు కీలక ప్రతిపాదన చేశాయి. ఈవీ విక్రయాలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద అందించే సబ్సిడీలను పొడిగించాలని కోరాయి. ఈ పథకం మార్చితో ముగియనున్న నేపథ్యంలో కంపెనీ ఈ మేరకు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశాయి. ఈవీ విభాగంలో సబ్సిడీలను కొనసాగించడం వల్ల కొనుగోలుదారులు, ముఖ్యంగా తక్కువ ధరలో కొనాలని భావించే వారికి సహాయపడుతుందని కంపెనీ చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈవీలకు అధిక గిరాకీ ఉన్నప్పటికీ, సబ్సిడీ ఆగిపోవడం వల్ల అమ్మకాలపై ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నాయి. ఫలితంగా భవిష్యత్తులో పెట్టుబడులపై ఒత్తిడి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సబ్సిడీల కారణంగా మొదటిసారి వాహన కొనే చాలామంది పెట్రోల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్‌కే ఎక్కువగా ఎంచుకున్నారని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సబ్సిడీలు తొలగిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఆన్-రోడ్ ధర రూ. 6,000 నుంచి రూ. 12,000 వరకు పెరుగుతాయి. ఈ పెరుగుదల వల్ల కొందరు కస్టమర్లు పెట్రోల్ వాహనాలను కొనేందుకు ఇష్టపడతారని కంపెనీలు వివరించాయి. బ్యాటరీలు, నియంత్రణ ఖర్చులు ఇప్పటికే ఎక్కువగా ఉన్నందున తాము ఈ ఖర్చును భరించలేమని చెబుతున్నాయి. ఫ్యాక్టరీలు, డీలర్‌షిప్‌లు, స్థానిక తయారీకి తగినట్టు ఈ ఏడాది పాలసీ పరంగా మద్దతుండాలని కంపెనీ వెల్లడించాయి.

### భారత్‌లో డ్రీమ్‌లైనర్‌లకు మంచి భవిష్యత్తు



ఒకేసారి 200-300 మంది ప్రయాణికులను, నాన్‌స్టాప్‌గా 15,000 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు చేరవేయగలిగే పెద్ద విమానం డ్రీమ్‌లైనర్ (బోయింగ్ 787) లకు భారత్‌లో మంచి భవిష్యత్ ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేసింది. సమీప భవిష్యత్తులో కంపెనీ మంచి వృద్ధి సాధించనుందని బోయింగ్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే తెలిపారు. భారత్- అమెరికా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. భారత ఏరోస్పేస్ రంగ పారిశ్రామికీకరణ లక్ష్యంగా ఇరు దేశాలు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. స్వల్పకాలిక సవాళ్లలో కొన్నింటిని అధిగమిస్తామనే ధీమాను సలీల్ వ్యక్తం చేశారు. గత ఏడాది జూన్‌లో అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్తున్న ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం ప్రమాదానికి గురై, వందల మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు జరుపుతోందని, త్వరలోనే నివేదిక వెలువడచ్చని పేర్కొన్నారు. బోయింగ్ 787 విమానాలను మనదేశంలో ఎయిరిండియా సొంతంగా నిర్వహిస్తోంది. ఎయిరిండియా చేతిలో మొత్తం 33 డ్రీమ్‌లైనర్‌లు ఉన్నాయి. ఇందులో 26 సంస్థకు చెందిన బీ787-8 మోడళ్లు కాగా, విస్తారా నుంచి ఆరు బీ787-9 విమానాలు, ఒక కొత్త విమానం ఉన్నాయి. 2022 జనవరిలో ఎయిరిండియా ప్రైవేటీకరణ జరిగిన తర్వాత, వచ్చేనెల 1న సరికొత్త డ్రీమ్‌లైనర్ వాణిజ్య కార్యకలాపాలను ఎయిరిండియా ప్రారంభించనుంది. నార్స్ అట్లాంటిక్ ఎయిర్‌వేస్ నుంచి లీజుకు తీసుకున్న కొన్ని డ్రీమ్‌లైనర్‌లను ఇండిగో నిర్వహిస్తోంది.

# టాక్స్ రిబేట్ అంటే ఏంటి? టాక్స్ సున్నా ఎలా చేసుకోవచ్చు




2026 బడ్జెట్‌కు ముందు భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈసారి ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 87ం కింద లభించే ఆదాయపు పన్ను రిబేటుపై ఈసారి కూడా ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం కొత్త ఆదాయపు పన్ను విధానం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేదా 2026-27 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి టాక్స్ రిబేట్ రూ. 60 వేలుగా ఉంది. అంటే.. ఇక్కడ రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి టాక్స్ రిబేట్ కింద పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇప్పుడు ఈ పరిమితిని మరింత పెంచాలనే డిమాండ్ వినిపిస్తోంది. లేదా నిబంధనల్ని మరింత సులభతరం చేయాలని నిపుణులు కోరుతున్నారు. అసలు టాక్స్ రిబేట్ అంటే ఏంటి.. పాత లేదా కొత్త పన్ను విధానాల్లో ఇదెలా పనిచేస్తుంది. ఇక్కడ టాక్స్ రిబేట్ అనేది ప్రభుత్వం.. పన్ను చెల్లింపుదారులకు ఇచ్చే రాయితీ అని చెప్పొచ్చు. ఇక్కడ ఈ రాయితీని.. చెల్లించాల్సిన మొత్తం పన్ను నుంచి తగ్గించుకోవచ్చు. ఇన్‌కంటాక్స్ యాక్ట్ సెక్షన్ 87ం కింద ఈ రిబేటు లభిస్తుంది. ఇక్కడ ఆదాయం ఒక పరిమితి లోపు ఉంటే.. పైసా పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. భారతదేశంలో నివసించే వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఔఖీఎ లు లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలు, కంపెనీలకు ఈ రిబేటు వర్తించదు. ఇంకా క్యాపిటల్ గెయిన్స్ వంటి ప్రత్యేక రేట్లు వర్తించే ఆదాయంపై ఈ రిబేటు వర్తించదు. ఇప్పుడు పాత లేదా కొత్త పన్ను విధానాల్లో ఈ టాక్స్ రిబేట్ ఎంత ఉందో చూద్దాం. పాత పన్ను విధానంలో సెక్షన్ 87ం కింద టాక్స్ రిబేట్ రూ. 12,500 గా ఉంది. దీని ప్రకారం.. రూ. 5 లక్షల వరకు ఆదాయంపై టాక్స్ పడదన్నమాట. ఇంకా స్టాండర్డ్ డిడక్షన్ రూ. 50 వేలుగా ఉంది కాబట్టి వేతనజీవులు పాత పన్ను విధానం కింద రూ. 5.50 లక్షల వరకు టాక్స్ చెల్లించాల్సిన పని ఉండదు. ఇక్కడ టాక్స్ రిబేట్ ఇలా వర్తిస్తుందన్నమాట. ఆపైన ఆదాయం ఉంటే మాత్రం.. టాక్స్ శ్లాబుల్ని బట్టి చెల్లించాల్సి వస్తుంది. కొత్త పన్ను విధానంలో చూస్తే.. ఇప్పటివరకు టాక్స్ రిబేటు రూ. 25 వేల వరకు వర్తించేది. ఇక్కడ ఈ టాక్స్ రిబేట్ ప్రకారం.. రూ. 7 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఉండదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75 వేలుగా ఉండగా.. ఇక్కడ రూ. 7.75 లక్షల వరకు ఆదాయంపై పన్ను వర్తించదు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఇది వర్తించగా.. 2025 బడ్జెట్‌లో కీలక మార్పులు చేశారు.

# వాట్సాప్ సంభాషణలను మెటా చదవగలదు!




మెరుగైన సేవలు అందించడంలో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు తీసుకొస్తుంటుంది. యూజర్ల డేటా ఎక్కడా లీక్ కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటూ ఉంటుంది. వాట్సాప్‌లో గోప్యత విషయంలో అంతర్జాతీయ వాట్సాప్ వినియోగదారుల బృందం యూఎస్ కోర్టును ఆశ్రయించింది. వాట్సాప్ మాతృ సంస్థ మెటా వినియోగదారుల ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ సందేశాలను చదవగలదని పేర్కొంది. యాప్‌లో ఈ ఫీచర్ ఉన్నప్పటికీ మెటా ఉద్యోగులకు ప్రైవేట్ సందేశాలను యాక్సెస్ చేసే అవకాశం ఉంటుందని ఆరోపించింది. మెటా ఉద్యోగులు తమ ఇంజినీర్ బృందానికి 'టాస్క్' అనే సందేశాన్ని పంపగానే వారు వినియోగదారుల ఐడీ నుంచి సందేశాలు చూసేలా కంపెనీ యాక్సెస్ ఇస్తుందని అంతర్జాతీయ వాట్సాప్ వినియోగదారుల బృందం దావాలో పేర్కొంది. వారు యూజర్ల సందేశాలను ఎందుకు చూడాలనుకుంటున్నారనే విషయాలను కూడా మెటా పరిశీలించిందని తెలిపింది. ఈ విషయంపై అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టులో మెటా కంపెనీపై దావా వేసింది. తమను మోసం చేసినందుకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. అయితే ఈ వాదనలకు ఎటువంటి ఆధారాలు సమర్పించలేదు. అంతర్జాతీ య వాట్సాప్ వినియోగదారుల బృందం చేస్తున్న ఆరోపణలను మెటా కొట్టిపడేసింది. వాట్సాప్‌లో ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ మెసేజీలు పంపేవారు.. అందుకొనేవారు మాత్రమే సందేశాలను చదవగలరని పేర్కొంది. ఎన్‌క్రిప్షన్ కీలు వినియోగదారుల పరికరాల్లోనే ఉంటాయి కాబట్టి వాటిని డీక్రిప్ట్ చేయడం సాధ్యం కాదని వెల్లడించింది. యూజర్ల గోప్యతను దృష్టిలోపెట్టుకొనే ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఫీచర్‌ను తీసుకువచ్చినట్లు తెలిపింది.

# క్రికెట్టే జీవితం కాదు.. అందరిలా వీడ్కోలు నిర్ణయాన్ని వాయిదా వేయను!



వ్యక్తిగత రికార్డులు, మైలురాళ్ల కంటే జట్టు కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడేవారు చాలా అరుదు. అలాంటి అరుదైన క్రికెటరే కేఎల్ రాహుల్ ఫార్మాట్ ఏదైనా టీమిండియా ఆపద్బాంధవుడి పాత్రలో ఒదిగిపోతున్న రాహుల్ వీడ్కోలుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియాలో కీలక ఆటగాడిగా ఎదిగిన రాహుల్ రిటైర్మెంట్ గురించి పెద్దగా ఆలోచించనని, క్రికెట్ ఒక్కటే జీవితం కాదని అన్నాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌తో యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ.. వీడ్కోలు పలకాలనే ఆలోచన తనకు వచ్చిందని.. అయితే.. అందుకు ఇంకాస్త సమయం ఉందని ఈ సొగసరి బ్యాటర్ వెల్లడించాడు.

బ్యాటింగ్ ఆర్డర్ మారడం నా వల్ల కాదు.. కెప్టెన్సీ కాకుండా వైస్ కెప్టెన్సీ ఇస్తారా? వంటి ఫిర్యాదులకు ఆమడ దూరంలో ఉండే రాహుల్ తనలో మరొకొన్ని రోజులు క్రికెట్ ఆడే సత్తా ఉందంటున్నాడు. యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడిన అతడు.. 'ఒకానొక సమయంలో వీడ్కోలు గురించి ఆలోచించాను. నా దృష్టిలో రిటైరవ్వడం కష్టమైనదేమీ కాదు. మనపట్ల మనం నిజాయతీగా ఉన్నప్పుడు.. సరైన సమయం వచ్చినప్పుడు వీడ్కోలు నిర్ణయాన్ని రోజుల తరబడి వాయిదా వేయడంలో అర్థముండదు. ప్రస్తుతానికైతే నేను అల్విదా చెప్పడానికి ఇంకా కొంచెం సమయం ఉంది. రిటైర్మెంట్ ప్రకటించాక.. కుటుంబంతో నచ్చినట్టుగా జీవితాన్ని గడిపేందుకు ప్రాధాన్యమిస్తాను. ఒక క్రికెటర్ అలా ఉండడం కాస్త కష్టమే. కానీ, నేను అంత ముఖ్యమైన ఆటగాడిని కాదని నా ఉద్దేశం. ఎవరు వీడ్కోలు పలికినా సరే మనదేశంలో క్రికెట్ కొనసాగుతూనే ఉంటుంది. అందుకే చెబుతున్నా.. జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలు చాలా ఉంటాయి. నేను ఈమధ్యే తండ్రినయ్యాను. పాప పుట్టాక నేను జీవితాన్ని చూసే దృక్కోణం ఎంతో మారింది' అని పేర్కొన్నాడు. అనుభవజ్ఞుడైన రాహుల్ కెప్టెన్‌గా జట్టును నడిపించాల్సింది. కానీ, గాయాల కారణంగా అతడు పలుమార్లు జట్టుకు దూరమయ్యాడు. ఇదే అంశంపై స్పందించిన రాహుల్.. 'గతంలో నేను చాలా సార్లు గాయపడ్డాను. స్పోర్ట్స్ హెర్నియా కారణంగా ఆస్పత్రి పాలయ్యాను. గాయాలతో పోరాడి.. కోలుకొని తిరిగి జట్టులోకి వచ్చేందుకు ఎంతో కష్టపడ్డాను. ఆ రోజులు నిజంగా ఎంతో కష్టంగా గడిచాయి. మానసికంగా కొన్నిసార్లు కుంగిపోయేవాడిని. అలాంటప్పుడు ఇక చాలు. క్రికెట్ లేకుండా కూడా నువ్వు బతకగలవు అని మన మనసు చెబుతుంది' అని వెల్లడించాడు.

**ఐసీసీ ఈవెంట్లలో**

ఫార్మాట్ ఏదైనా జట్టులో ఉండాల్సిన ఆటగాడు రాహుల్. అనుభవమే కాదు.. పరిస్థితులకు తగ్గట్టు ఆడగల నైపుణ్యం కలిగిన ఈ కర్నాటక స్టార్ ఐసీసీ ఈవెంట్లలో టీమిండియాకు కొండంత ఆస్తిలా మారాడు. స్వదేశంలో.. రాబోయే టీ20 ప్రపంచకప్ స్క్వాడ్‌కు ఎంపికైన రాహుల్.. జట్టును గెలిపించే బాధ్యతను తీసుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటివరకూ 67 టెస్టులు, 94 వన్డేలు ఆడిన రాహుల్.. ఐపీఎల్‌లోనూ తన మార్క్ విధ్వంసక ఇన్నింగ్స్‌లతో డేంజరస్ బ్యాటర్ల జాబితాలో చేరాడు

### విండీస్ వీరుడి విధ్వంసం.. కేవలం 49 బంతుల్లోనే శతకం



క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో టీ20 లీగ్ ప్రారంభమైంది. వరల్డ్ లెజెండ్స్ ప్రో టీ20 లీగ్ పేరిట భారత్‌లో అరంగేట్రం చేసిన ఈ లీగ్.. నిన్ననే (జనవరి 26) మొదలైంది. ఈ లీగ్‌లో మొత్తం ఆరు ఫ్రాంచైజీలు (ఢిల్లీ వారియర్స్, దుబాయ్ రాయల్స్, గుర్‌గ్రామ్ థండర్స్, మహారాష్ట్ర టైకూన్స్, పూణే పాంథర్స్, రాజస్థాన్ లయన్స్) పాల్గొంటున్నాయి. పది రోజుల పాటు జరిగే ఈ లీగ్‌లో మొత్తం 18 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ లీగ్‌లో హర్భజన్ సింగ్, శిఖర్ ధవన్, ఇర్ఫాన్ పఠాన్, షేన్ వాట్సన్, డేల్ స్టెయిన్ తదితర 90 మంది దిగ్గజాలు పాల్గొంటున్నారు. లీగ్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ వారియర్స్, దుబాయ్ రాయల్స్ తలపడ్డాయి. ప్రారంభ మ్యాచ్‌లో విధ్వంసకర శతకం నమోదైంది. ఢిల్లీ వారియర్స్‌కు ఆడుతున్న విండీస్ ఆటగాడు చాడ్విక్ వాల్టన్ కేవలం 49 బంతుల్లోనే శతక్కొట్టాడు. ఫలితంగా అతని జట్టు దుబాయ్ రాయల్స్‌ను 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్స్.. పీటర్ ట్రెగో (60), కిర్క్ ఎడ్వర్డ్స్ (41), అంబటి రాయుడు (36), కెప్టెన్ శిఖర్ ధవన్ (26) ఓ మోస్తరు స్కోర్లు చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. యూసఫ్ పఠాన్ (2), రిషి ధవన్ (7) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. వారియర్స్ బౌలర్లలో సుభోత్ భాటి 3, హర్భజన్ సింగ్ 2, ఇసురు ఉదాన ఓ వికెట్ తీశారు. అనంతరం 197 పరుగుల లక్ష్యాన్ని వారియర్స్ సునాయాసంగా ఛేదించింది. చాడ్విక్ వాల్టన్ (62 బంతుల్లో 128; 14 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ మెరుపు శతకంతో వారియర్స్‌ను కేవలం 16.3 ఓవర్లలోనే విజయతీరాలకు చేర్చాడు. అతనికి మరో ఓపెనర్ శ్రీవట్స్ గోస్వామి (56) సహకరించాడు. వారియర్స్ కోల్పోయిన ఏకైక వికెట్ పియుశ్ చావ్లాకు దక్కింది.

## స్పోర్ట్స్

### విహాన్ మల్హోత్రా సూపర్ సెంచరీ.. జింబాబ్వే ముందు కొండంత లక్ష్యం!




అండర్ -19 ప్రపంచకప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత జట్టు సూపర్ సిక్స్‌లోనూ భారీ స్కోర్ కొట్టింది. బులవాయలో జింబాబ్వే బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగిస్తూ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(52) హడలెత్తించగా.. విహాన్ మల్హోత్రా(109) సూపర్ సెంచరీతో చెలరేగాడు. అభిగ్యాన్ కుందు(61) జతగా బౌండరీలతో రెచ్చిపోయిన విహాన్ చివరిదాకా క్రీజునంటుకొని స్కోర్ 350 దాటించాడు. వీరిద్దరి మెరుపులతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా 8 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది.

టాస్ గెలిచి టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన జింబాబ్వే పెద్ద పొరపాటే చేసింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(52) తన మార్క్ విధ్వంసంతో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తిస్తూ మెరుపు అర్ధ శతకతో శుభారంభవిచ్చాడు. అరోన్ జార్జ్(23), కెప్టెన్ ఆయుష్ మాత్రే(21)లు విఫలమైనా దూకుడైన ఆటతో పవర్ ప్లేలో స్కోర్ వంద దాటించాడు.

**సెంచరీ భాగస్వామ్యం**

నాలుగేసి సిక్సర్లు, ఫోర్లతో 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన వైభవ్‌ను చిముగొరే బోల్తా కొట్టించాడు. వైభవ్ ఔటయ్యాక.. విహాన్ మల్హోత్రా(109 నాటౌట్), అభిగ్యాన్ కుందు(61)లు క్రీజులో పాతుకుపోయారు. వీరిద్దరూ ఆడుతూ పాడుతూ స్కోర్‌బోర్డును ఉరికించారు. ఐదో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో భారీ స్కోర్‌కు పునాది వేసిన అభిగ్యాన్‌ను మడ్జెన్‌గెరెరీ పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత టెయిలెండర్లు అంబ్రిష్(21), హెనిల్ పటేల్(30)లతో కలిసి జట్టు స్కోర్ 300 దాటించిన విహాన్.. 49వ ఓవర్లో బౌండరీలో సెంచరీ సాధించాడు. దాంతో.. ప్రత్యర్థికి 353 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది ఆయుష్ మాత్రే సేన.




## దేవర 2కి గ్రీన్ సిగ్నల్..
## మే నుంచి షూటింగ్, వచ్చే ఏడాదిలోనే విడుదల అంటూ నిర్మాత బిగ్ అప్డేట్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దేవర' బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సంగతి తెలిసిందే. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ సినిమా, ఓపెనింగ్స్ నుంచే రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోయింది. ఈ విజయంతోనే 'దేవర'కు సీక్వెల్ ఉంటుందా? లేదా? అనే ప్రశ్నలు అప్పటినుంచి అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి.'దేవర 2' గురించి ఎన్నో రూమర్లు సోషల్ మీడియాలో తిరుగుతూనే ఉన్నాయి. షూటింగ్ డిలే అవుతోందని, ప్రాజెక్ట్ నిలిచిపోయిందని కూడా కొంతమంది ప్రచారం చేశారు. అయితే ఇప్పుడు వాటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టేలా నిర్మాతల నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడింది. 'దేవర' నిర్మాతలలో ఒకరైన మిక్కిలినేని సుధాకర్, యువసుధా ఆర్ట్స్ అధినేతగా తాజాగా కీలక అప్డేట్ ఇచ్చారు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే ఢ 'దేవర 2' షూటింగ్ ఈ ఏడాది మే నెల నుంచి ప్రారంభం కానుంది. అలాగే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నాం. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఒక్కసారిగా ఉత్సాహం రెట్టింపయ్యింది. సీక్వెల్ విషయంలో నెలకొన్న అనుమానాలన్నింటికీ ఇప్పుడు చెక్ పెట్టారని చెప్పొచ్చు. ప్రస్తుతం ఎన్టీఆర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ప్రాజెక్ట్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కొంత వరకు పూర్తయ్యింది. మే నెల కల్లా ఆ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే అవకాశం ఉందని టాక్. ఆ వెంటనే ఎన్టీఆర్ 'దేవర 2' సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారని సమాచారం. 'దేవర' మొదటి భాగం క్లైమాక్స్ వద్దే రెండో భాగానికి భారీ స్కోప్ ఉందని దర్శకుడు కొరటాల శివ ముందే హింట్ ఇచ్చారు. అందుకే 'దేవర 2'పై అంచనాలు మరింత పెరిగాయి. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్, కొరటాల శివ స్ట్రాంగ్ న్యారేషన్, గ్రాండ్ మేకింగ్ఢ ఈ మూడు కలిసి సీక్వెల్‌ను మరింత పవర్‌ఫుల్‌గా మార్చనున్నాయనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది. మొత్తానికి, 'దేవర 2' మే నుంచి షూటింగ్, వచ్చే ఏడాదిలో రిలీజ్ అన్న నిర్మాత అప్డేట్‌తో ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి ఇది నిజంగా ఊహించని గిఫ్ట్ అని చెప్పొచ్చు. ఇప్పుడు అందరి చూపు దేవర పార్ట్ 2 ఎలాంటి రికార్డులు బ్రేక్ చేస్తుందో చూడాలి.

# ఇదేం ట్విస్ట్.. అప్పుడే ఓటీటీలో కార్తీ కొత్త సినిమా..
## తెలుగులోనూ స్ట్రీమింగ్.. అధికారిక ప్రకటన

తమిళ స్టార్ కార్తీ హీరోగా వచ్చిన లేటెస్ట్ సినిమా 'వా.. వాతియార్'. దర్శకుడు నలన్ కుమారస్వామి తెరకెక్కించిన ఈ సినిమాలో ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్ గా నటించింది. పలు సార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టీజర్, ట్రైలర్ లు ఆసక్తికరంగా ఉండడంతో ఈ సినిమాపై అంచనాలు మంచిగానే ఉన్నాయి. అయితే విడుదల తరువాత మాత్రం అంతగా రెస్పాన్స్ రాలేదు. స్టోరీ, స్క్రీన్ ప్లే చాలా నీరసంగా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. ఇదిలా ఉంటే ఇదే సినిమాను 'అన్నగారు వస్తారు' అనే టైటిల్ తో తెలుగులో కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ సంక్రాంతి సమయంలో థియేటర్స్ దొరక్క పోవడంతో తెలుగు డబ్బింగ్ వెర్షన్ విడుదల కాలేదు. అయితే ఇప్పుడు ఈ సినిమాను డైరెక్టుగా ఓటీటీలోకి తీసుకొస్తున్నారు. ఒరిజినల్ వెర్షన్ తో పాటు తెలుగు, కన్నడం, హిందీ, మలయాళం భాషల్లో కార్తీ సినిమాను స్ట్రీమింగ్ కు రానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. 'అన్నగారు వస్తారు' ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ అమెజాన్ ప్రైమ్ దక్కించుకుంది. ఈ మేరకు జనవరి 28 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఓటీటీ సంస్థ అధికారికంగా ప్రకటించింది. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమాలో సత్యరాజ్, రాజ్‌కిరణ్, నిళల్‌గళ్ రవి, ఆనందరాజ్, శిల్పా మంజునాథ్, కరుణాకరన్, జి.ఎం. సుందర్, మధుర్ మిట్టల్ వడివుక్కరసి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు. మరి థియేటర్స్ లో నెగెటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమాకు ఓటీటీలో ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి.



## బోర్డర్ 2కి కలెక్షన్ల వర్షం..
## ఒక్క రోజే రూ.59 కోట్ల రూపాయల కలెక్షన్సా?




ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్న పేరు ఒక్కటే 'బోర్డర్ 2'. విడుదల రోజునే మార్నింగ్ షోలు కొన్ని చోట్ల టెక్నికల్ కారణాలతో రద్దయినా, ఆ ప్రభావం బాక్సాఫీస్‌పై ఏమాత్రం కనిపించలేదు. అసలు ఊహించని స్థాయిలో ఈ సినిమా కలెక్షన్లతో దూసుకుపోతూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ కీలక పాత్రల్లో నటించిన ఈ దేశభక్తి యాక్షన్ డ్రామా, రిపబ్లిక్ డే వీకెండ్‌ను పూర్తిగా తన ఖాతాలో వేసుకుంది. వర్డ్ ఆఫ్ మౌత్ బలపడటంతో, రోజురోజుకీ థియేటర్ల ముందు హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. తాజా అధికారిక లెక్కల ప్రకారం, 'బోర్డర్ 2' కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ. 250 కోట్ల మార్క్‌ను దాటింది. ఇండియాలోనూ ఈ సినిమా రికార్డు స్థాయి వసూళ్లతో 2026 బాక్సాఫీస్ రేసులో టాప్ గేర్‌లో దూసుకుపోతోంది. దర్శకుడు అనురాగ్ సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రం దేశీయ మార్కెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది.నాలుగు రోజుల్లో ఇండియాలో రూ. 180 కోట్లు (నెట్) వసూలు చేసింది. పన్నులతో కలిపి ఇండియా గ్రాస్ కలెక్షన్స్ రూ. 212.5 కోట్లు . ఓపెనింగ్ డే రూ. 30 కోట్లతో మొదలైన ప్రయాణం, రోజురోజుకీ వేగం పెంచుకుంది. ప్రత్యేకంగా జనవరి 26 రిపబ్లిక్ డే సెలవు సినిమాకు భారీగా కలిసి వచ్చింది. ఒక్క ఆ రోజే రూ. 59 కోట్ల నెట్ వసూలు చేయడం విశేషం. మొదటి రోజు కంటే నాలుగో రోజు డబుల్ కలెక్షన్స్ రావడం ట్రేడ్‌లో అరుదైన విషయం. దేశీయంగానే కాదు, అంతర్జాతీయ మార్కెట్లలో కూడా 'బోర్డర్ 2'కు మంచి స్పందన లభిస్తోంది. ఓవర్సీస్‌లో సుమారు వి4.3 మిలియన్ వసూలు చేసింది. వరల్డ్ వైడ్ నాలుగు రోజుల గ్రాస్: రూ. 251 కోట్లు. ముఖ్యంగా యూకే, కెనడా వంటి దేశాల్లో సన్నీ డియోల్‌కు ఉన్న ఫ్యాన్‌బేస్ మరోసారి బయటపడిందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఈ కలెక్షన్ ప్రభంజనంలో, రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఓపెనింగ్ వీకెండ్ రికార్డులు వెనక్కి వెళ్లాయి. స్టార్ ఇమేజ్ కంటే కథ, భావోద్వేగం ప్రేక్షకులను థియేటర్లకు తీసుకెళ్తాయన్న విషయాన్ని 'బోర్డర్ 2' మరోసారి నిరూపించిందనే అభిప్రాయం వినిపిస్తోంది. సాధారణంగా విడుదల రోజున షోలు క్యాన్సిల్ అయితే నెగెటివ్ టాక్ వస్తుంది.




## అనసూయ ఒప్పుకుంటే గుడి కడతా! పర్మిషన్ ఇవ్వమంటున్న వీరాభిమాని

అనసూయ.. ఈ ముద్దుగుమ్మ గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాంకర్ గా కెరీర్ మొదలు పెట్టి ఇప్పుడు సినిమాల్లో రాణిస్తుంది అనసూయ. జబర్దస్త్ లో తన అందంతో, డాన్స్ లతో, చలాకీ మాటలతో ప్రేక్షకులను కవ్వించింది అనసూయ ఆ తర్వాత సినిమాల్లో నటిస్తూ మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఇక ఇప్పుడు సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్ లో వచ్చిన రంగస్థలం సినిమాతో మంచి క్రేజ్ తెచ్చుకుంది. దాంతో అనసూయకు అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం పలు సినిమాల్లో అనసూయ కీలక పాత్రల్లో కనిపించి మెప్పించింది. ఇప్పుడు టీవీ షోలతో పాటు సినిమాల్లోనూ నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది. పెళ్ళై ఇద్దరు పిల్లల తల్లి అయినప్పటికీ అందంలో కుర్రహీరోయిన్స్ తో పోటీపడుతోంది ఈ ముద్దుగుమ్మ. సినిమాలు, టీవీ షోలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది అనసూయ. రెగ్యులర్ గా తన సినిమా అప్డేట్స్ తో పాటు పర్సనల్ లైఫ్ విశేషాలను, ఫొటోలను కూడా పంచుకుంటుంది. ఇక అనసూయకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో మంది అనసూయను అభిమానిస్తుంటారు.. కాగా అనసూయకు వీరాభిమాని అయిన ఓ పూజారి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. అనసూయ అంటే తనకు చాలా ఇష్టమని.. ఆమె కోసం ఏకంగా గుడి కడతానని చెప్పుకొచ్చాడు. అనసూయ పర్మిషన్ ఇస్తే చాలు ఏకంగా ఆమె కోసం గుడి కడతామని తెలిపాడు.

# విజయ్ 'రణబాలి' గ్లింప్స్‌కు ఏఐ వాడలేదు.. దర్శకుడు క్లారిటీ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రాబోతున్న 'రణబాలి' టైటిల్ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ వీడియోలోని అద్భుతమైన విజువల్స్ చూసి, ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రూపొందించినదని పలు జర్నలిస్ట్‌లతో పాటు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ వార్తలపై దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ స్పందిస్తూ.. 'రణబాలి' గ్లింప్స్‌లో ఎక్కడా... వాడలేదని స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఇందులోని ప్రతి ఫ్రేమ్‌ను సాంకేతిక బృందం ఎంతో కష్టపడి సంప్రదాయ పద్ధతుల్లోనే డిజైన్ చేసిందని, కేవలం ఈ చిన్న వీడియో కోసమే తమ టీమ్ కొన్ని నెలల పాటు శ్రమించిందని ఆయన వెల్లడించారు. 'టాక్సీవాలా' తర్వాత రాహుల్ దర్శకత్వంలో వస్తున్న ఈ పీరియడ్ డ్రామా 1854 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలం నాటి వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతోంది. రష్మిక మందన్న 'జయమ్మ' పాత్రలో నటిస్తుండగా, అజయ్-అతుల్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. విజయ్ దేవరకొండను ఒక వీరుడిలా చూపిస్తూ భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న విడుదల కానుంది.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# వరంగల్‌లో అరూరి ఎఫెక్ట్

**రమేష్ రీఎంట్రీతో రాజకీయ సమీకరణాల్లో మార్పు**
**మున్సిపల్ ఎన్నికల ముంగిట వేగం పెంచిన కారు**
**కార్పోరేటర్లు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారంటూ అరూరి వ్యాఖ్యలు**
**జీడబ్ల్యూఎంసీపై పట్టు సాధించడమే లక్ష్యంగా వ్యూహ రచన**
**వర్ధన్నపేట - స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కేంద్రాలపై గట్టి ప్రభావం**



ధర్మఘంట, జనవరి 27, వరంగల్

జిల్లా రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ 'ఘర్ వాపసీ' ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన బీఆర్ఎస్లోకి తిరిగి రావడం జిల్లా రాజకీయాల్లో వేగంగా మార్పులు తెస్తోంది. పార్టీ మార్పులతో పాటు నేతల వలసలు, ఎన్నికల వ్యూహాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈనెల 28న కేసీఆర్ సమక్షంలో అధికారికంగా బీఆర్ఎస్లో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

**గతంలో వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం**

ఆయనకు ఉండటంతో, ఈ రీఎంట్రీ పార్టీకి వ్యూహాత్మకంగా కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. కాంగ్రెస్లో ఉన్న పలువురు కార్పొరేటర్లు తిరిగి బీఆర్ఎస్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆరూరి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో ఈ వలసలు మరింత ఊపందుకునే అవకాశం ఉందని అంచనా. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కదలికలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. జీడబ్ల్యూఎంసీపై పట్టు సాధించే లక్ష్యంతో బీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆధిపత్యం సాధించేందుకు బీఆర్ఎస్ గట్టి వ్యూహాలను సిద్ధం చేస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కేడర్ నిర్మాణం జరుగుతోంది. గతంలో ఆయన జిల్లా స్థాయిలో పార్టీని సమన్వయం చేసిన అనుభవం ఈ ఎన్నికల్లో ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వర్ధన్నపేటతో పాటు స్టేషన్ ఘన్పూర్, గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు డివిజన్లలో ఆరూరి రమేష్ కు గణనీయమైన ప్రభావం ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం, కేడర్లో అసంతృప్తి పెరగడం వంటి అంశాలు ఆయన్ను బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడానికి కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రభావం మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల రూపంలో ప్రతిబింబించే అవకాశముందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎన్నికల వ్యూహాలకు పదును..!**

ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతి మున్సిపాలిటీకి ఇంచార్జీలను నియమించి, కేడర్ ను ఎన్నికలకు సిద్ధం చేశారు. వరంగల్ కార్పొరేషన్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవడమే లక్ష్యంగా పార్టీ పావులు కదుపుతోంది. ఆరూరి రమేష్ రీఎంట్రీతో ఈ వ్యూహాలకు మరింత పదును పెరుగుతుందన్న చర్చ పార్టీ క్యాడర్లో జరుగుతోంది. మొత్తానికి, వరంగల్ రాజకీయాల్లో 'ఘర్ వాపసీ' పరిణామాలు మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే కీలకాంశంగా మారుతున్నాయి. పార్టీ మార్పులు, నేతల వలసలు, వ్యూహాత్మక నియామకాల మధ్య జిల్లా రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారుతున్నాయి.

# మానవ సంబంధాలు మానసిక ఆరోగ్యంపై ప్రభావం



ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు ఒక సంక్లిష్టమైన జాలంగా మారిపోతున్నాయి. కుటుంబ బంధాలు,వైవాహిక సంబంధాలు,సామాజిక ఒడిదుడుకులు మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలలో మానవ సంబంధాలు చెడిపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి.ఆర్థిక ఇబ్బందులు,ఉద్యోగ భారం, సామాజిక ముద్రలు వంటివి ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.మానవ సంబంధాలు మనిషిలో మార్పులకు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.అయితే,ఈ సంబంధాలు పాజిటివ్గా ఉంటే మానసిక ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తాయి,నెగెటివ్గా మారితే విధ్వంసకరంగా మారతాయి.ఈ విశ్లేషణలో,ఈ అంశాన్ని లోతుగా పరిశీలిస్తూ,సమస్యలను గుర్తించి,చైతన్యం కలిగించే సూచనలు తీసుకోవాలి. ఎందుకంటే అవగాహనే మార్పుకు మొదటి అడుగు కాబట్టి.

**వైవాహిక మరియు కుటుంబ సంబంధాలలో ఒత్తిడి**

మానసిక ఆరోగ్యానికి పునాది వంటివి మానవ సంబంధాలు.

**వైవాహిక సంబంధాల్లో పెరిగిపోతున్న ఒత్తిడి మరియు హింస**

మనిషి మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.ఆధునిక జీవనశైలి,డిజిటల్ డిస్ట్రాక్షన్లు, ఆర్థిక ఒత్తిళ్లు,సమయ లేమి ఈ బంధాలను దెబ్బతీస్తోంది.ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఒక తీర్పులో విడాకులు లేదా వైధవ్యంలో మహిళలు ఇష్టం లేని గర్భాన్ని అబార్షన్ చేయించుకునే హక్కును గుర్తుచేసింది, ఎందుకంటే ఇలాంటి పరిస్థితులు మానసికంగా కుంగదీస్తాయి. భర్తతో విడిపోవడం బలవంతం చేయడం మానసిక వేధింపును కలిగిస్తుంది,ఇది సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలను విమర్శిస్తుంది. ప్రస్తుత సంబంధాలు సమానత్వం లేకుండా ఒత్తిడిని పెంచుతాయి.లోతుగా చూస్తే, అద్దె సంబంధాలు ఆందోళన, నిరాశ,స్వీయగౌరవం తగ్గడం వంటి సమస్యలను పెంచుతాయి.మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.డిప్రెషన్ను 50% పెంచుతాయి మరియు స్వీయహాని ఆలోచనలకు దారితీస్తాయి.అయితే,పాజిటివ్ సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని బలోపేతం, ఆందోళనను తగ్గిస్తాయి,స్వీయ గౌరవాన్ని పెంచుతాయి మరియు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి.సంబంధాల్లో సమానత్వం,సమాచార భాగస్వామ్యం పెంచడం ద్వారా ఒత్తిడిని తగ్గించవచ్చు. మహిళలు తమ హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలి మరియు సమాజం అసమానతలను సవాలు చేయాలి.

**కుటుంబ హింస దీర్ఘకాలిక ప్రభావాలు**

కుటుంబ హింస మరొక తీవ్ర సమస్యగా మారింది. భారతదేశంలో 36.8% మహిళలు గృహ హింస బారిన పడుతున్నారు,ఇది శారీరక వేధింపులు మానసిక నిరాశను రెట్టింపు చేస్తాయి.గృహ హింస బారిన పడిన తల్లుల కౌమారదశ పిల్లలు ఆందోళన,నిరాశ వంటి రుగ్మతలకు గురవుతారు. బాల్యంలో శారీరక,మానసిక లేదా లైంగిక హింస,తల్లిదండ్రుల విడాకులు సైకోటిక్ సమస్యలకు దారితీస్తాయి.సమాజం ఈ హింసను సాధారణీకరించడం విమర్శకు తావిస్తుంది. కుటుంబాలు రక్షణ కాకుండా వేధింపు కేంద్రాలుగా మారుతున్నాయి.హింసాత్మక సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తాయని అధ్యయనాలు చూపిస్తున్నాయి.సామాజిక సంబంధాలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి మరియు నెగెటివ్ రిలేషన్షిప్లు స్ట్రెస్ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి,ఇమ్యూన్ సిస్టమ్ను బలహీనపరుస్తాయి. బాల్యంలోని హింస దీర్ఘకాలికంగా మానసిక సమస్యలకు దారితీస్తుంది, మరియు ఇది తరాల మధ్య అంతరంగా కొనసాగుతుంది. అందుకే హింసను సాధారణీకరించకుండా, కుటుంబాల్లో ఓపెన్ కమ్యూనికేషన్ ప్రోత్సహించాలి. హెల్ప్లైన్లు,కౌన్సెలింగ్ వంటివి ఉపయోగించి సమస్యలను పరిష్కరించాలి.సమాజం హింసాకారులను జవాబుదారీగా చేయాలి మరియు పిల్లలకు ఆరోగ్యకరమైన సంబంధాల గురించి బోధించాలి.

**ఒంటరితనం మరియు సామాజిక బంధాల చెడిపోవడం**

ఆధునిక సమాజంలో ఒంటరితనం మహమ్మారిలా వ్యాపిస్తోంది.1లైఫ్ హెల్ప్లైన్కు వచ్చిన 38,437 కాల్స్లో సంబంధాల సమస్యలు,ఆర్థిక ఇబ్బందులు,ఉద్యోగ భారం ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.బెంగళూరులో 27 ఏళ్ల యువకుడు ఆన్లైన్ నష్టాలతో,ఢిల్లీలో 32 ఏళ్ల మహిళ ప్రేమ బంధం ముగిసిన తర్వాత,పశ్చిమబెంగాల్లో 23 ఏళ్ల ట్రాన్స్జెండర్ సామాజిక వివక్షతో ఒంటరితనానికి గురైంది.ఇవి సామాజిక బంధాలు ఎలా చెడిపోతున్నాయో సజీవ సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. లోతుగా పరిశీలిస్తే,ఒంటరితనం మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.ఇది ఆందోళన,నిరాశ,యాంటీసోషల్ బిహేవియర్కు దారితీస్తుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి. సామాజిక ఐసోలేషన్ రోజుకు 15 సిగరెట్లు తాగినంత హానికరం మరియు పాజిటివ్ సంబంధాలు జీవితకాలాన్ని 50% పెంచుతాయి.ఇటీవల చర్చల్లో హింస మరియు సామాజిక వివక్ష ఒంటరితనాన్ని పెంచుతున్నాయని తెలుస్తోంది. దీనిని అధిగమించాలంటే సామాజిక బంధాలను పెంచుకోవడం,స్నేహితులు, కమ్యూనిటీ గ్రూప్లు,ఆన్లైన్ సపోర్ట్ నెట్వర్క్లు ఒంటరితనాన్ని తగ్గిస్తుంది. మానసిక ఆరోగ్య సేవలను ఉపయోగించి,సమస్యలను ముందుగా గుర్తించాలి.సమాజం వివక్షను తగ్గించి,ఇన్క్లూసివ్నెస్ ప్రోత్సహించాలి.


**చైతన్యం మరియు మార్పు దిశగా అడుగులు**


మానవ సంబంధాలు మానసిక ఆరోగ్యానికి డబుల్-ఎడ్జ్ స్వోర్డ్ వంటివి.పాజిటివ్ అయితే బలోపేతం,నెగెటివ్ అయితే విధ్వంసం అని అధ్యయనాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. ఆరోగ్యకరమైన సంబంధాలు ఆందోళనను తగ్గిస్తాయి,జీవిత సంతృప్తిని పెంచుతాయి మరియు మరణ రిస్క్ను తగ్గిస్తాయి.అయితే,టాక్సిక్ సంబంధాలు డిప్రెషన్, ఆందోళనను పెంచుతాయి. చైతన్యం కలిగించడం ద్వారా మార్పు సాధ్యం సంబంధాల్లో సమానత్వం,కమ్యూనికేషన్ ప్రోత్సహించండి,హెల్ప్లైన్లు (1లైఫ్) ఉపయోగించండి, మానసిక ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా చూడండి. సమాజంలో హింస మరియు ఒంటరితనాన్ని సవాలు చేసి, ఆరోగ్యకరమైన బంధాలను నిర్మించండి.ఇది మీ మానసిక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా సమాజాన్ని మెరుగుపరుస్తుంది.

గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్

ధర్మ ఘంట నిజామాబాద్, జనవరి 27





మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం బోధన్ పట్టణంలోని విజయ మేరీ హైస్కూల్ లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం బోధన్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కోసం విజయ మేరీ పాఠశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఇతర అధికారులతో డిస్ట్రిబ్యూషన్ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా, అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిపోలింగ్ కు ఆస్కారం ఉండకూడదని అన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విఠల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

## కూడా చైర్మన్ కలిసిన విద్యార్థి నాయకులు వినతి పత్రం ఇచ్చిన విద్యార్థి నాయకులు



ధర్మఘంట హన్మకొండ జిల్లా

హనుమకొండ జిల్లా కేంద్రంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఖఖణా చైర్మన్ ఆఫీసులో ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి కూడా చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి విద్యార్థులు పడుతున్న సమస్యల పరిష్కారం కోసం ఆయనతో చర్చించడం జరిగింది ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు అయ్యే విధంగా చూడాలని మధ్యాహ్న సమయంలో విద్యార్థులు ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న సమస్యలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయండని ఆయనతో చర్చించడం జరిగింది విద్యార్థుల సమస్యలు విన్న ఖఖణా చైర్మన్ స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని ఉన్నత అధికారులకు స్థానిక ఎమ్మెల్యేలకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జఏఎ యూత్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ మీఖీ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కాకతీయ యూనివర్సిటీ సీనియర్ నాయకులు మారపల్లి రాణాప్రతాప్ మీఖీ నాయకులు కట్ల సందీప్ మరియు జఏఎ వరంగల్ జిల్లా అధ్యక్షులు కన్నల రవి మరియు తదితరులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

## వినియోగంలోకి మరిన్ని మున్సిపల్ వాహనాలు



ధర్మఘంట, జనవరి 27 కరీంనగర్

రానున్న వేసవి సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకుగాను, చెత్త సేకరణకు అవసరాలకు తగిన విధంగా మరికొన్ని వాహనాలను మున్సిపల్ కార్పొరేషన్ వినియోగంలోకి తెచ్చింది. మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కోర్టు చౌరస్తా వద్ద గల వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో 35 ట్రాక్టర్లు, 25 ట్రాలీలు, 10 స్వచ్ఛ ఆటోలు, 10 వాటర్ ట్యాంకర్లను వినియోగం లోకి తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్.ఈ రాజ్ కుమార్, ఈఈ సంజయ్ కుమార్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ బీమ్ వర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్ ఎంహెచ్ఓ సుమన్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు కవిత

ధర్మ ఘంట నిజామాబాద్
జనవరి 27





నిజామాబాద్ లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం విచ్చలవిడిగా మత్తు పదార్థాలూ లాభమయ్యే విధంగా నడుచుకుంటున్నారన్నారు.

నిజామాబాద్ కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు పరామర్శించారు. ఆమె పరిస్థితి కొంచెం క్రిటికల్ గా ఉన్నప్పటికీ కాస్త ఇంప్రూమెంట్ ఉందన్నారు.ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ ను చంపే ధైర్యం గంజాయి బ్యాచ్ చేసిందంటే ప్రభుత్వం అంటే వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టమవుతోందన్నారు. డ్రగ్స్, గంజాయి ఫ్రీ చేస్తామని ఈ ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ గుర్తు చేశారు.కానీ దురదుష్టమేమిటంటే గ్రామాల్లో కూడా ఫ్రీ గా గంజాయి, డ్రగ్స్ దొరికే పరిస్థితి వచ్చిందన్నారు. స్కూల్ లోకి కూడా గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చి పిల్లలను పాడు చేస్తున్నారన్నారు. దీని కారణంగా ఆడవాళ్లే బాధితులుగా మారే పరిస్థితి ఉంటుందన్నారు.గృహహింస ఘటనలు జరగటానికి డ్రగ్స్, గంజాయి కారణమవుతోందనీ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మత్తు వదిలి డ్రగ్స్, గంజాయి మాఫియా పై వారి ప్రతాపం చూపాలన్నారు. అదే విధంగా ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి వెపన్స్ ఇవ్వాలన్నారు.వాళ్లకు ట్రైనింగ్ లో గన్ ఫైరింగ్ ఉంటుంది. కానీ వెపన్స్ ఇవ్వటం లేదన్నారు.వారి వద్ద వెపన్స్ ఉంటే గంజాయి, డ్రగ్స్ మాఫియాకు కాస్త భయం ఉంటుందన్నారు. డ్రగ్స్, గంజాయి మహమ్మరిని తరిమికొట్టేందుకు జాగృతి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి ముఠాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సౌమ్య కుటుంబానికి జాగృతి తరఫున అండగా ఉంటామున్నారు జాగృతి అధ్యక్షురాలు కవిత.

ధర్మఘంట

# కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్






**ధర్మ ఘంట నిజామాబాద్ జనవరి 27**

బోధన్ మండలం అమ్దాపూర్ లో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులు ఏ ఒక్కరిని కూడా లోనికి అనుమతించకూడదని, విద్యార్థినులను వారి తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలని హితవు పలికారు. తరచూ ఇంటికి వెళ్ళే బాలికల విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు పదేపదే ఎందుకు వెళ్తున్నారు అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఇటీవలే బాన్సువాడ మండలం బోర్లం ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్ కు చెందిన సంగీత అనే 8వ తరగతి విద్యార్థిని నిర్వాహకుల అజాగ్రత్త వల్ల ప్రమాదం బారిన పడి మృతి చెందిందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా సంఘటనలకు ఆస్కారం లేకుండా బాలికల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అంతకుముందు 8వ తరగతి క్లాస్ రూంను కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పాఠాలు బోధించి వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా, పాఠశాల చుట్టూ తక్షణమే ప్రహరీ గోడ నిర్మాణం జరిపించాలని, ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చి వేయించాలని, విద్యుత్ వైరింగ్ సరి చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్ కేటాయిస్తామని అన్నారు. వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఎంఈఓ నాగయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను సాఫీగా నిర్వహించాలి

## కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం దిశా నిర్దేశం







**ధర్మ ఘంట నిజామాబాద్, జనవరి 27**

ఎలాంటి అవాంతరాలు, లోటుపాట్లకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, సాఫీగా జరిపించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీ.జీ.పీ శివధర్ రెడ్డిలతో కలిసి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లాలో నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయని, మొత్తం 146 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఎన్నికల షెడ్యూల్ ను అనుసరిస్తూ బుధవారం నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిజామాబాద్ నగరం, బోధన్ పట్టణాలలో ఎన్నికల భద్రత విషయంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నియమావళిని తు.చ తప్పక పాటించాలని, మున్సిపల్ పట్టణ పరిధిలో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఫోటోలు, ఇతర ప్రచార సామాగ్రిని తొలగించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించారు. నామినేషన్ సెంటర్లలోని అన్ని గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కామారెడ్డి ఇంచార్జి అదనపు కలెక్టర్ మధుమోహన్, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్ల పరిశీలన.



**ధర్మఘంట, జనవరి 27, కరీంనగర్**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లకు, కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలోని 14 వార్డులకు, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు, హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నోటిఫికేషన్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించి డివిజన్ల వారీగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అభ్యర్థులు వచ్చే మార్గం వెళ్లే మార్గం వేరువేరుగా ఉండాలని, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు.

## ప్రజా ధనం వృధా కుల్చివేతలు కమీషన్ల కోసమే...

**రామగుండంలో ప్రజా వ్యతిరేక దుర్మార్గపు పాలన.**

**ఇంటిగ్రేటెడ్ వెజ్,నాన్ వెజ్ మార్కెట్ ను వెంటనే పూర్తి చేయాలి.**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్.**



**ధర్మఘంట, జనవరి 27,రామగుండం:**

రామగుండంలో ప్రజా వ్యతిరేక దుర్మార్గపు పాలన సాగుతుందని ప్రజా ధనం వృధా చేస్తున్నారని కుల్చివేతలు కమీషన్ల కోసమేనని ఇంటిగ్రేటెడ్ వెజ్,నాన్ వెజ్ మార్కెట్ ను వెంటనే పూర్తి చేయాలి అని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రెండేళ్ల పాలనపై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విడుదల చేసిన ఛార్జ్ షీట్ లోని ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బి. ఆర్. ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం గోదావరిఖని అడ్డగుంటపల్లి ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీ.ఆర్.ఎస్ ప్రభుత్వంలో సి.ఎం గ్రాంట్ 200 కోట్ల నిధుల ద్వారా రామగుండంలోనీ ప్రతి డివిజన్ లో డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ పనులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. తన హయంలో టీ యూ ఎఫ్ ఐ డి ద్వారా 100 కోట్ల రూపాయలు,అమృత్ ద్వారా 250 కోట్లు, డి ఎం ఎఫ్ టీ ద్వారా 54 కోట్ల రూపాయలు శాంక్షన్ అయ్యి ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోవడం జరిగిందని అవే నిధులు ఇప్పుడు విడుదల అయినా ప్రస్తుత ఎమ్మెల్యే పట్టించుకోకుండా, కమిషన్ల కోసం ఉన్న లైట్లను ఊడదీసి మళ్ళీ కొత్తవి వేయడం, పాత డ్రైనేజీలను తీసి కొత్తవి వేయడం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరికి సౌకర్యవంతమైనా వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మణానికి నాలుగున్నర కోట్ల రూపాయలతో నాడు తొలి సిఎం కేసీఆర్ నిధులు మాంజూరు చేశారని చెప్పారు. రెండేళ్లు గడుస్తున్న ఈ పనులను పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాంతం పై ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కు అవగాహన లేకనే అభివృద్ధి కుంటుపడింది అని మాజీ ఎమ్మెల్యే చందర్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామిలు నేరవేర్చి ప్రజలను ఓటు అడుగాలన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజాధనం వృధా కాకుండా ఇంటిగ్రేటెడ్ వెజ్ మార్కెట్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు.

## పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య నామినేషన్ల స్వీకరణ

## పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.

**ధర్మఘంట, జనవరి 27, కరీంనగర్**



నగరంలో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో, రేపటి నుండి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియను అత్యంత భద్రతతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం భద్రతా ఏర్పాట్లపై మీడియాకు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని రెండు భవనాలలో మొత్తం 15 గదులను నామినేషన్ల స్వీకరణ కోసం కేటాయించారు. ఇక్కడ 33 మంది రిటర్నింగ్ అధికారులను నియమించగా, ప్రతి గది వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. నామినేషన్ కేంద్రాల నుండి 100 మీటర్ల దూరం వరకు కఠినమైన యాక్సెస్ కంట్రోల్ అమలులో ఉంటుందని, ఈ పరిధి దాటి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని తెలిపారు. భద్రతలో భాగంగా నామినేషన్ కేంద్రాల భవనాల ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించనున్నారు. ప్రమాదకర ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మంటలు అంటుకునే వస్తువులు ఇతర అనధికారిక వస్తువులను నామినేషన్ కేంద్రాల్లోకి తీసుకురావడంపై కఠిన నిషేధం విధించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 25 నుండి 30 శాతం వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు సీపీ తెలిపారు. ఈ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అదనపు బలగాలను మోహరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని, అభ్యర్థులు మరియు ప్రజలు పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి,మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లతో కలిసి నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిన భవనాలు, గదులను మంగళవారం సందర్శించారు.

## నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ పోటీ

**ధర్మ ఘంట నిజామాబాద్**




మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ పార్టీ అభ్యర్థులను సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా ప్రకటించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్ లో జరిగిన పత్రిక విలేకరుల సమావేశం సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా నిజామాబాద్ నగర కార్యదర్శి నీలం సాయిబాబా మాట్లాడుతూ నిజామాబాద్ నగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 7 వ డివిజన్ లో కామ్రేడ్ ఆకుల పాపన్న, 24 వ డివిజన్ లో కామ్రేడ్ ఆకుల అరుణలు పోటీలో ఉంటారని, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే పార్టీ అని , గతంలో మా పార్టీ నుండి రెండు పర్యాయాలు గెలిచిన ఆకుల పాపన్న డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగిందని, డివిజన్ అభివృద్ధితో అభివృద్ధితోపాటు నగరంలో ఉన్న అనేక సమస్యలపై మున్సిపాలిటీ పాలకవర్గంలో ప్రశ్నించే గొంతుకగా నిలిచారని, నేడు 7 మరియు 24 వ డివిజన్ లలో రోడ్లు ,డ్రైనేజీ, వీధి లైట్లు మరియు అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో గెలిచిన కార్పొరేటర్లు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా గాలికి వదిలేసారని, నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండే ఆకులపాపన్నను ,ఆకుల అరుణను 7వ డివిజన్ ,24 వ డివిజన్ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించి నిజామాబాద్ మున్సిపాలిటీ పాలకవర్గంలో ప్రజల సమస్యలపై పోరాటం చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు యం.శివకుమార్, జి.రమేష్ ,మోహన్, నర్సింగ్ రావు,పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం తప్పనిసరి

**ధర్మ ఘట, జనవరి 27 మోత్కూరు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలకు తప్పనిసరి ప్రాతినిధ్యం కల్పించాలనే ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం మోత్కూర్ మున్సిపాలిటీలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య అధ్యక్షతన పద్మశాలిలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పద్మశాలీలు, చేనేత కార్మికులు రాజకీయంగా ముందుకు రావాలనే ఉద్దేశ్యంతో నిర్ణయాలు తీసుకున్నారు.సభలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ, పద్మశాలీలు స్థానిక సంస్థలు, చట్టసభల్లో ప్రజా ప్రతినిధులుగా నిలబడితేనే మన సమస్యలు, ముఖ్యంగా చేనేత కార్మికుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి చేరుతాయనారు. పరిష్కారం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో చేనేత రంగం ఎదురుకుంటున్న ఇబ్బందులు, పద్మశాలీల అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా పద్మశాలీల సమస్యలు, చేనేత కార్మికుల సమస్యలను చర్చించుకునేందుకు చేనేత సహకార సంఘ భవనంలో ప్రత్యేక హాలు కేటాయించాలని పాలకవర్గాన్ని కోరుతూ తీర్మానం చేశారు.సభలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నరసయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచం జగన్నాథం, తెలంగాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వనం శాంతి కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండు ప్రసాద్, పట్టణ సంఘ అధ్యక్షులు



మహేశ్వర వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షులు నల్ల యాదగిరి, మున్సిపాలిటీ అధ్యక్షులు కూరపాటి రాములు, మండల చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వంగరి రాములు, చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నరసయ్య, ప్రధాన కార్యదర్శి పసునూరి యాదగిరి, రవీందర్, జల్ది సోమయ్య, తాటి లక్ష్మణ్, గుర్రం అంబదాస్, కస్తూరి వీరస్వామి, వంగరి యాదగిరి, పసునూరు చంద్రయ్య, పోచం నరసయ్య, మహేశ్వరం నాగరాజు, పోచం భాస్కర్, పోచం వెంకన్న, గంజి గోవర్ధన్, మసరం కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాటి వెలుగు జిలుగుల ఆర్మూర్ నేడు అనాథగా కన్నీరు

**అభివృద్ధి, సంక్షేమం పట్టని కాంగ్రెస్ , బీజేపీ... కాంగ్రెస్ అంటేనే ఫాదర్ ఆఫ్ చీటర్స్ పార్టీ**

**ఇక్కడి కాంగ్రెస్ నేతలు బ్రోకర్లు, బీజేపీ నేతలు జోకర్లు.. మందికి పుట్టినోళ్లు మావోళ్ళే అనడం ఈ రెండు పార్టీల నైజం**

**ధర్మ ఘంటఆర్మూర్, జనవరి 27:**

పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో దూసుకుపోయిన వెలుగుజిలుగుల ఆర్మూర్ నేడు అనాథగా మారి కన్నీరు పెడుతోందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళ వారం ఆర్మూర్ లో జరిగిన ఒక కార్య క్రమంలో వివిధ పార్టీలకు చెందిన మట్టల ప్రవీణ్, రాజ్యలక్ష్మి లతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారందరినీ జీవన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్ లోకి సాదరంగా అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం పట్టని కాంగ్రెస్ , బీజేపీల నేతలు బ్రోకర్లు, జోకర్లుగా మారారని ఎద్దేవా చేశారు. మందికి పుట్టినోళ్లు మావోళ్ళే అనడం ఈ రెండు పార్టీల నైజమని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ మంజూరు చేసిన పథకాలను తామే తెచ్చామని చెప్పుకోవడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులకు సిగ్గులేదా? అని ఆయన మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యేకు దమ్ముంటే ఆర్మూరు అభివృద్ధికి డిల్లీ నుంచి నిధులు తేవాలన్నారు. ఆర్మూర్ మునిసి పాలిటీని గాలికొది లేసిన కాంగ్రెస్ నాయకులు దోచుకు తినడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాం ఆర్మూర్ పట్టణానికి స్వర్ణ యుగమన్నారు. రేవంత్ సర్కార్ రాక్షస పాలనతో రాతియుగం దాపురించిందని జీవన్ రెడ్డి దుయ్యబట్టారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్లలో ఆర్మూర్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానని ఆయన చెప్పారు.

ఆర్మూర్ పట్టణం తన హయాంలో ఎట్లుంది? నేడెట్లుంది ? అని ఆయన ప్రశ్నించారు. వంద కోట్ల నిధులు తెచ్చి ఆర్మూర్ ను సుందర పట్టణంగా తీర్చిదిద్దానన్నారు. రూ. 15కోట్ల 60లక్షలతో పట్టణమంతా రోడ్లు వేయించానని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. ఆర్టీసీ, ఆలూరు వంటి బైపాస్ రోడ్లు నిర్మించి ఆర్మూర్ కు మణిహారాలుగా అలంకరించానన్నారు. పట్టణంలో 18పార్కులు నిర్మించానని, గూండ్ల చెరువు మినీ ట్యాంక్ బండ్



నిర్మాణానికి రూ. 4కోట్లు మంజూరు చేయించానని, మల్లారెడ్డి చెరువు అభివృద్ధికి రూ.3కోట్లు మంజూరు చేయించానని, కోటి రూపాయల నిధులు వెచ్చించి 10జిమ్ లు ఏర్పాటు చేయించానని జీవన్ రెడ్డి వివరించారు. నిజాం సాగర్ కెనాల్ పై వంతెన నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేయించానని, మూడు నుంచి అయిదు వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చి ఆర్మూర్ నియోజకవర్గాన్ని తీర్చి దిద్దానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన తులం బంగారం, స్కూటీలు, పెంచి ఇస్తామన్న పెన్షన్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు ఏమయ్యాయని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ ,టీడీపీ పాలనలో ఆర్మూర్ ను పట్టించుకున్న నాధుడే లేడు. కాంగ్రెస్ ఫాదర్ ఆఫ్ చీటర్స్ పార్టీ. బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెట్టే విచ్ఛిన్నకర శక్తి. అరవింద్ ఒక ఫాల్స్, ఫ్రాడ్, ఫేక్ ఎంపీ .బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఒక జోకర్ అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. బీజేపీ నిజామాబాద్ జిల్లాలో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని, నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తామని అనడం మత విద్వేషాలు రెచ్చగొట్టడమేన ని ఆయన ఫైర్ అయ్యారు. బీజేపీకి దమ్ముంటే ముందు అహ్మదాబాద్ పేరు మార్చాలని, డిల్లీ పేరును హస్తినాపురం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్మూర్ కాంగ్రెస్ ఇంచార్జి పీవీఆర్ అవినీతికి అంతే లేదని విమర్శించారు. కాగా ఓడినా, గెలిచినా తన జీవితమంతా ఆర్మూర్ ప్రజల సేవకే అంకితమని జీవన్ రెడ్డి విస్పష్టం చేశారు అన్నివర్గాల ప్రజలు తన ఆత్మబంధువు లన్నారు.ఎవరికి ఏ ఆపదొచ్చినా అండగానిలుస్తానని, అన్నా అని పిలిస్తే నేనున్నానంటూ తోడుగా వస్తానని ఆయన అన్నారు. ఆర్మూర్ నియోజక వర్గాన్ని అభివృద్ధి శిఖరంగా మారుస్తానని ఆయన పేర్కొంటూ తనను ఓడించినందుకు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ ప్రజా దైవమని అభివర్ణించారు. అద్భుతమైన పాలనతో ఆయన దేశాన్నే కదిలించా రన్నారు. మళ్లీ కారే రావాలి, సారే కావాలి, ఈ అబద్దాల కాంగ్రెస్, జిత్తులమారి బీజేపీ పోవాలి అని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బీ ఆర్ఎస్ గెలవడం ఖాయమని జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులనే గెలిపించండి: ఎండీ జాహంగీర్




**ధర్మ ఘంట, జనవరి 27మోత్కూర్:**

మోత్కూర్ మున్సిపాల్టీ ఎన్నికల్లో సిపిఎం పార్టీ పోటీ చేయనున్నట్లు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండి జాహంగీర్ తెలిపారు. మంగళవారం మున్సిపాల్టీ పరిధిలోని ముఖ్య కార్యకర్తల సమావేశం సీఐటీయూ జిల్లా నాయకులు కూరేళ్ల నర్సింహా అధ్యక్షతన జరిగింది. ప్రజల మధ్య నిత్యం ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే కమ్యూనిస్టులనే గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాహంగీర్ మాట్లాడుతూ, రాజకీయాలు రోజురోజుకు వ్యాపారంగా మారుతున్నాయని, డబ్బు ఆధారిత రాజకీయాలను ప్రజలు ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, ప్రలోభాలకు గురిచేసే నేతలను ప్రజలు తిరస్కరించాలని కోరారు. పదవులు ఆభరణం కాదు, ప్రజా పోరాటాలకు ఆయుధం అని జాహంగీర్ స్పష్టం చేశారు. మోత్కూర్ మున్సిపాల్టీలో ఉండే సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ఘనత సిపిఎంకే దక్కుతుందని, ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకత్వం అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సురేందర్, పట్టణ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, కూరపాటి రాములు, మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల హామీలను అమలు చేయాలి రీజినల్ సెక్రటరీ దిలీప్




**ధర్మ ఘంట జనవరి 27, నల్గొండ**

బ్యాంకు ఉద్యోగుల హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని టీ.జీ.బీ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ దిలీప్ డిమాండ్ చేశారు. వారంలో ఐదు రోజుల పని దినాన్ని అమలు చేయాలంటూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఉన్న టీజీబీ బ్యాంకు ముందు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసన చేపట్టిన అనంతరం ఆ బ్యాంకు నుండి గడియారం సెంటర్ మీదుగా అన్ని బ్యాంకుల ఉద్యోగులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి పలు డిమాండ్లతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ కె వెంకటేష్,రిటైర్డ్ ఎంప్లాయిస్ రవీందర్ రెడ్డి, బ్రహ్మచారి,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## యూపీ తర్వాతే ఏపీనే...

**తిరుపతి**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ బడుల్లో పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కేంద్రం సహకారంతో.. పీఎంశ్రీ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ, వృత్తి విద్యతో పాటు ఆధునిక విద్యను అందిస్తోంది. ఆటపాటలతో పాటు, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లల సమగ్ర వికాసానికి కృషి చేస్తోంది. భవిష్యత్తుకు బాటలు వేసేలా ఈ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నారు. దేశంలోనే యూపీ తర్వాత ఏపీలోనే ఎక్కువ పీఎంశ్రీ స్కూళ్లు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ దిశగా కేంద్రం సహకారంతో పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు.

# అక్రెడిటేషన్ల జీవోను సమూలంగా సవరించాలి




**ప్రెస్‘ స్టిక్కర్ నిబంధన తొలగించండి**

**-మంత్రి ని, స్పెషల్ కమీషనర్ ను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**ధర్మ ఘంట హైదరాబాద్, జనవరి 27:**

మీడియా అక్రెడిటేషన్ల జీవో 252ను సవరించడం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు కృతజ్ఞతలు తెలిపారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, రాష్ట్ర కో-కన్వీనర్లు తన్నీరు శ్రీనివాస్, కుడుతాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవి కుమార్, నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, సమాచార భవన్ లో కమీషనర్ ప్రియాంక ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవో 252 సవరణ సమూలంగా జరగలేదని, మరోసారి జీవోను పున:సమీక్షించి సవరించాలని వారు కోరారు. జీవో సవరణలో కేబుల్ చానల్స్, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు న్యాయం జరగడం లేదని, గతంలో కేబుల్ ఛానల్స్ కు ఐఅండ్ పీఆర్ ద్వారా 12 రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కార్డులు, నాలుగు జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేవారని, ఈ విషయాన్ని తాము పలు తమరి దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, సవరించిన జీవోలో కేబుల్ చానల్స్ అంశమే లేకపోవడం బాధాకరమని అన్నారు. యూనియన్ గా తమ అభిప్రాయాన్ని చెప్పినప్పటికీ కేబుల్ చానల్స్ విషయంలో, నియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఇచ్చే కార్డుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని, అదే విధంగా ఎంపానల్మెంట్ లేని చిన్న, మధ్య తరహా పత్రికలకు గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఇచ్చినట్లు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, అదే విధంగా రెగ్యులర్ గా నడుస్తున్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని వారు మంత్రిని, కమీషనర్ ను కోరారు. ‘ప్రెస్’స్టిక్కర్ నిబంధన తొలగించాలి అక్రెడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలకు ‘ప్రెస్‘ అని రాసుకోవాలంటూ జారీ చేసిన సర్క్యులర్ ను రద్దు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య కోరారు. ఈ మేరకు ఆయన, పలువురు ఫెడరేషన్ నాయకులు మంగళవారం సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సర్క్యులర్... జర్నలిస్టులను, జర్నలిజం వృత్తిని అవమానించేదిగా ఉందని, జర్నలిస్టులకు కేవలం సంక్షేమ పథకాల కోసం గుర్తింపు కార్డుగా ఇచ్చే అక్రెడిటేషన్ కార్డును జర్నలిస్టుగా గుర్తించేందుకు ప్రామాణికం చేయడం తగదని, అక్రెడిటేషన్ కార్డు ఉన్న వారే తమ వాహనాలకు “ప్రెస్“అని రాసుకోవాలనే నిబంధన సరైంది కాదని, ఈ సర్క్యులర్ నిబంధన ఇటు జర్నలిస్టుల సమాజానికి, అటు జర్నలిజం వృత్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుందని మామిడి సోమయ్య కమీషనర్ తో అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే అక్రెడిటేషన్ కార్డు కలిగి ఉన్న జర్నలిస్టులు మాత్రమే జర్నలిస్టులు కాదని, అక్రెడిటేషన్ కార్డు లేని జర్నలిస్టులు చాలా మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది జర్నలిస్టులు వుండగా, వీరిలో సగం మందికి మాత్రమే ప్రభుత్వం అక్రెడిటేషన్ కార్డులు ఇస్తున్నదని,



మిగతా సగం మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్ ఎన్ ఐ (ప్రస్తుత పీ ఆర్ జీఐ) రిజిస్ట్రేషన్ పొందిన మీడియా సంస్థలు గుర్తింపు కార్డులతో పనిచేస్తున్నారని అన్నారు.

ఎంపానల్మెంట్ లేని మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఉండవని, అంత మాత్రాన ఆ జర్నలిస్టులను జర్నలిస్టులే కాదనే విధంగా తమ వాహనాలకు ప్రెస్ స్టిక్కర్ పెట్టుకోవద్దంటూ ప్రభుత్వం నిబంధనలు విధించడం సరైంది కాదని అన్నారు. సమాజంలో నకిలీ జర్నలిస్టులను కట్టడి చేయడానికి అనేక మార్గాలున్నాయని, ప్రత్యేక రూల్స్ ద్వారా నియంత్రించవచ్చని, అలాంటి చర్యలకు తామేమీ వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో అసలైన జర్నలిస్టులను అవమానించడం, అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డు లేని అనేక మంది జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో తమరు జారీ చేసిన సర్క్యులర్ “మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు“గా అంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సర్క్యులర్ నిబంధన ను వెంటనే ఉపసంహరించాలని మామిడి సోమయ్య కోరారు. దీనిపై పునరాలోచన చేస్తామని, రవాణాశాఖ అధికారులతో చర్చిస్తానని కమీషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు.

# త్వరలో లోకేష్‌కు పట్టాభిషేకం

విజయవాడ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పట్టాభిషేకానికి ముహూర్తం రెడీ అయిందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి గా నారా లోకేశ్ ను వచ్చే ఏడాది చేయాలని అంతా సిద్ధం చేస్తున్నట్లు పార్టీలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఢిల్లీలోనూ ఈ మేరకు బీజేపీ కే?ంద్ర పెద్దలతో ఈ విషయం చర్చించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు కనపడుతున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ భావినేతగా నారా లోకేశ్ ఇటు క్యాడర్ లోనూ, అటు నేతల్లోనూ ఫిక్సయిపోయారు. అయితే ముఖ్యమంత్రి పదవి చేపట్టే దెప్పుడు అన్న దానిపైనే జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పదవి అన్న ప్రచారం జరిగినా దానిని కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే మంచిదన్న అభిప్రాయంలో నారా కుటుంబం ఉందని తెలిసింది.నారా లోకేశ్ పార్టీపైనా, ప్రభుత్వంపైన ఇప్పటికే పట్టు సంపాదించుకున్నారు. ఆయన విద్య, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ అన్ని శాఖల బాధ్యతను నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఇక ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు తో సమానంగా పర్యటిస్తూ కేంద్రమంత్రులను, బీజేపీ పెద్దలను తరచూ కలసి వస్తున్నారు. నారా లోకేశ్ ఎప్పటికైనా ఈ పదవి ఇవ్వడం తప్పదు. టీడీపీ క్యాడర్ అభిప్రాయం కూడా అదే.
అయితే చంద్రబాబు నాయుడు ఈ టర్మ్ ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే అప్పుడు నారా లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేద్దామని భావించినప్పటికీ కొన్ని కారణాలతో వచ్చే ఏడాది..
అంటే సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ముఖ్యమంత్రిగా నారా లోకేశ్ ను చేయాలని నారా కుటుంబం ఫిక్సయినట్లు వార్తలొస్తున్నాయి.తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయింది. అందుకే ఈసారి నారా లోకేశ్ ను ముందుగానే ముఖ్యమంత్రిని చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు కూడా ఉన్నారని తెలిసింది.
చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా గత కొద్ది రోజులుగా జరుగుతుంది.
అందుకే మంత్రి వర్గ సమావేశానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతోనూ, పార్లమెంటు సమావేశాలకు ముందు పార్లమెంటు సభ్యులతో నారా లోకేశ్ సమావేశమయి వారికి దిశానిర్దేశం చేయడం కూడా ఆ ఆలోచనల్లో భాగమేనని అంటున్నారు. ముందుగా మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు జగన్ పాదయాత్ర ప్రారంభం కాకముందే నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి పదవి పై కూర్చోబెట్టాలన్న నిర్ణయానికి



వచ్చినట్లు బలంగా అమరావతిలోనూ టాక్ వినిపిస్తుంది. మరి ఇది ప్రచారమా? లేక నిజంగా జరుగుతుందా? అన్నది చూడాలంటే మరికొన్ని నెలలు వేచి చూడక తప్పదు.

గుంభనంగా క్యాడర్

చంద్రబాబు నాయుడు పాలనలో కొన్ని లోపాలు జగన్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలున్నాయి. కానీ టీడీపీ నాయకత్వం లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఎమ్మెల్యేల అవినీతి ఆరోపణలతో పాటు పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా ఈసారి టీడీపీకి అననుకూలత అని చెప్పాలి. చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లినప్పటికీ అక్కడ టీడీపీ నేతలతో సమావేశం అవుతున్నా.. తాను చెప్పదలచుకున్నది చెప్పి వచ్చేస్తున్నారు. అంతే తప్ప వారి బాధలను, కష్టాలను కూడా స్వయంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.ఇక నారా లోకేశ్ కూడా క్యాడర్ ను పట్టించుకునే తీరిక.. సమయం ఆయనకు లేదు. కార్యకర్తలకు భరోసా ఉంటానని చెప్పిన లోకేశ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కనీసం టీడీపీ సోషల్ మీడియాలో కనిపించే నెగిటివ్ ఒపీనియన్ లను కూడా లోకేశ్ కు టీం చేర వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఆల్ ఈజ్ వెల్ అన్న ఫీలింగ్ లో ఉన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలసి ఉంటే జగన్ ను సులువుగా ఓడించగలమన్న ధైర్యం మాత్రమే తండ్రీకొడుకుల్లో కనపడుతుంది తప్ప.. క్యాడర్ కష్టాలను పట్టించుకోవాలన్న ధ్యాస మాత్రం ఇసుమంతైనా పెట్టడం లేదు. అదేమంటే రాష్ట్రాభివృద్ధి కోసం అంటూ రాగాలు తీస్తున్నారు.దీంతో స్థానిక శాసనసభ్యులు కనీసం టీడీపీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం లేదు. స్థానిక నాయకత్వం వారి నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యతను వారిద్దరిలో ఎవరో ఒకరు తీసుకోకపోతే పార్టీకి నష్టం వాటిల్లుతుంది. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ఫిక్స్‌డ్ ఓటు బ్యాంక్‌ను కదిలించటం చాలా కష్టం. టీడీపీకి ఉన్న ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవాలి, తటస్థ ఓటర్లను మెప్పించాలి. ప్రస్తుతం ఉన్న తీరులో టీడీపీ శ్రేణులే స్తబ్దుగా ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్ లుపాలనలోనే మునిగిపోవటం టీడీపీకి నష్టం చేస్తుందేమో అన్న ఆందోళన టీడీపీని అభిమానించే వారిలో ఉన్నారు. ఏ ఏ వర్గాలు కూటమి ప్రభుత్వం పాలనపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రయత్నం చేయకపోగా.. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల నష్టం తప్ప లాభం ఏమీ ఉండదన్నది ఇప్పటికైనా పసుపు పార్టీ నాయకత్వం గుర్తించ గలిగితే కొంత నష్టనివారణ చేపట్టవచ్చు.

# అమరావతికి చట్టబద్ధత..

అమరావతి

అమరావతి రాజధాని కి చట్టబద్ధతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చట్టం చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు వరుసగా కేంద్ర మంత్రులతో సమావేశాలు కావడం.. టిడిపి తో పాటు కూటమి ఎంపీలకు కీలక సూచనలు చేయడం చూస్తుంటే మాత్రం బిల్లు పార్లమెంట్ లోకి వస్తుందని అర్థమవుతోంది. అయితే ఇప్పుడు ఆ 29 గ్రామాలను మాత్రమే కలిపి అమరావతిగా గుర్తిస్తారా? లేకుంటే పక్కన ఉన్న విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ గుర్తిస్తారా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే అమరావతి అంటే మున్సిపాలిటీ కాదు అని.. అదో మహానగరం గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కేంద్రం చట్టబద్ధత కల్పిస్తున్న దృష్ట్యా అమరావతిని మరింత విస్తృతపరచి గుర్తించాల్సిన అవసరం ఉంది. విజయవాడ తో పాటు గుంటూరు నగరాలను కలిపితేనే.. అమరావతి అనేది ఒక అద్భుతమైన నగరంగా ఆవిష్కృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. అందరి అభిప్రాయంతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 50 వేల ఎకరాల వరకు సమీకరించి అమరావతి రాజధాని పనులను మొదలుపెట్టారు. ఇంతలోనే అధికార మార్పిడి జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అమరావతి నిర్వీర్యం అయింది. గత ఐదేళ్లపాటు అమరావతి రైతులు పడరాని పాట్లు పడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి చుక్కలు చూపించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం వచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి




కూడా. అయితే ఇప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధానిపై విషం కక్కుతూనే ఉంది. దీంతో అమరావతికి చట్టబద్ధత తెస్తే కానీ తమకు శాంతి ఉండదని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. అందుకే ఏపీ విషయంలో ప్రత్యేక పరిగణలోకి తీసుకొని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది.అయితే కేవలం 29 పంచాయితీలను మాత్రమే అమరావతిగా గుర్తిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికే అదనపు భూసేకరణ చేపడుతున్నారు. చెంతనే విజయవాడ ఉంది. ఆపై గుంటూరు నగరం కూడా ఉంది. కృష్ణా,గుంటూరు, ఎన్టీఆర్ తో పాటు పరిసర జిల్లాల్లో కొన్ని ప్రాంతాలను అమరావతిలో చేర్చితే ఇదో మహానగరంగా, ప్రపంచ స్థాయి నగరంగా గుర్తించబడుతుంది. ఇప్పటికే అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది ప్రణాళిక. అందుకు తగ్గట్టు చంద్రబాబు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆ 29 పంచాయితీలకే అమరావతిని పరిమితం చేయడం ఎంత మాత్రం సుముఖత కాదు. అయితే అందుకే సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలతో సమన్వయం చేసుకుంటున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత విషయంలో సానుకూలతలకు ప్రయత్నిస్తున్నారు. విస్తృత సంప్రదింపులు జరపాలని పార్టీ ఎంపీలకు సూచిస్తున్నారు. మొత్తానికైతే అమరావతి చట్టబద్ధత విషయంలో ఏం జరుగుతుంది అనే దానిపై అంతటా చర్చ నడుస్తోంది.

## వెలిగొండ ప్రాజెక్ట్ క్రెడిట్ వార్

**ఒంగోలు :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'క్రెడిట్ వార్' తారాస్థాయికి చేరింది. దశాబ్దాలుగా నలుగుతున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు ప్రాంతాల తలరాతను మార్చే ఈ ప్రాజెక్టును తామే పూర్తి చేశామని ఒకరు.. కాదు తామే పునాది వేసి పరుగులు పెట్టించామని మరొకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు.వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే, 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఈ ప్రాజెక్టుకు నిధుల ప్రవాహం పెరిగింది. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చి, సుమారు రూ. 3,610 కోట్లను వెచ్చించారు. ప్రధాన కాలువలు, హెడ్ రెగ్యులేటర్ పనులను వైఎస్సార్ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఆ తర్వాత 2014-19 మధ్య చంద్రబాబు టన్నెల్ బోరింగ్ మెషీన్లను రంగంలోకి దించి, అత్యంత క్లిష్టమైన మొదటి టన్నెల్ పనులను 90శాతం పూర్తి చేశారు. 2019-24 మధ్య జగన్ రెండో టన్నెల్ తవ్వకాన్ని పూర్తి చేసి, ఎన్నికలకు ముందు ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాలని నిర్ణయించుకోవడంతో రాజకీయం రాజుకుంది.

## వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా

విజయవాడ

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40% ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్ మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్ట చెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

## ఏపీలో రాజ్యసభ రేస్ షురూ...

అమరావతి

ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. ఈ ఏడాది జూన్ తో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అంతకంటే ముందే వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక జరగనుంది. అయితే కూటమికి స్పష్టమైన బలం ఉండడంతో.. ఆ నాలుగు స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడంతో ఆ పార్టీకి ఛాన్స్ లేదు. ఆ పార్టీ పోటీ చేయదు కూడా. ప్రస్తుతం వైసీపీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు రాజ్యసభలో. అయితే ముగ్గురు ఖాళీ కానుండడంతో నలుగురు సభ్యులు మిగలనున్నారు. అయితే కూటమి పార్టీలో మాత్రం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.ఈ ఏడాది జూన్లో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్, వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యం. ఏడాది కిందట సాన సతీష్ టిడిపి తరఫున గెలవడంతో ఆయనకు రెన్యువల్ చేయనున్నారు. అయితే మిగతా మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను తీసుకుంటుంది? జనసేనకు ఎన్ని? బిజెపికి ఎన్ని? అనేది చర్చ నడుస్తోంది. అయితే మొత్తం నాలుగు ఎంపీ స్థానాల్లో టిడిపికి మూడు, జనసేనకు ఒకటి దక్కే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో జనసేనకు అవకాశం కల్పించలేదు. బిజెపి ఎక్కువ ఎంపీ పదవులను దక్కించుకుంది. అందుకే ఈసారి బిజెపికి ఛాన్స్ లేదని.. జనసేనకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి మూడు పార్లమెంట్ స్థానాలకు గాను.. ఒకటి సానా సతీష్ కు కొనసాగింపు ఉంటుంది. మిగతా రెండు ఎంపీ పదవుల కోసం పార్టీలో విపరీతమైన పోటీ ఉంది. ముఖ్యంగా వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, భాష్యం రామకృష్ణ, గల్లా జయదేవ్, దేవినేని ఉమామహేశ్వరరావు.. ఇలా చాలామంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడే ఓడిపోతానని తెలిసి రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు యనమల రామకృష్ణుడు సైతం రాజ్యసభ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని రకాల పదవులు అనుభవించారు. అందుకే ఇప్పుడు పెద్దల సభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు. భాష్యం రామకృష్ణ సైతం ఎంపీగా పోటీ చేయాలని చూశారు. అప్పట్లో అవకాశం దక్కలేదు. రాజ్యసభ ద్వారా ఆ కోరిక తీర్చుకోవాలని చూస్తున్నారు. గల్లా జయదేవ్ అయితే 2024 ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. అయినా సరే పార్టీతో అనుబంధం ఎక్కువ. రాజ్యసభ పదవి కోరుకుంటున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు అయితే పార్టీ కోసం టికెట్ వదులుకున్నారు. తనకు రాజ్యసభ ఇవ్వాలని కోరుతున్నారు.అయితే సాధారణంగా రాజ్యసభ పదవి అంటే కార్పొరేట్ సెక్షన్ తో కూడుకున్నది. జాతీయస్థాయిలో సంబంధాలు, పెద్ద పెద్ద వ్యవహారాలు చూసేవారికి ఆ పదవి కట్టబెడతారు. అందుకే ఈసారి కొత్త వ్యక్తులకు అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. అనూహ్యంగా కొందరు వ్యక్తులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని టిడిపి వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత నిజం ఉందో చూడాలి. కానీ ఆశావహులు మాత్రం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

## విజయసాయిరెడ్డి పాదయాత్ర...

నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చాణక్యుడుగా పేరుగాంచిన విజయసాయి రెడ్డి మళ్లీ వార్తల్లో నిలిచారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు నంబర్ 2గా చక్రం తిప్పి, అనూహ్య పరిణామాల మధ్య ఆ పార్టీని వీడిన ఆయన, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్ కోసం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది రాజకీయాలకు గుడ్ బై చెప్పి వ్యవసాయం చేసుకుంటానన్న ఆయన, ఇప్పుడు రూటు మార్చి మళ్లీ రాజకీయ క్షేత్రంలోకి అడుగుపెడుతుండటం ఏపీ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.2024 ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీలో వచ్చిన మార్పులు, అధినేత జగన్ మోహన్ రెడ్డితో పెరిగిన దూరం విజయసాయి రెడ్డిని తీవ్ర నిర్ణయం తీసుకునేలా చేశాయి. అప్పట్లో తన ఎంపీ పదవికి రాజీనామా చేసిన ఆయన, రాజకీయాలు తనకు ముగిసిన అధ్యాయమని ప్రకటించారు. అయితే, ఇటీవల ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో భాగంగా ఈడీ ఎదుట హాజరైన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. "జూన్ తర్వాత రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అవుతాను.. మరిన్ని వివరాల కోసం ఈ నెలాఖరు వరకు వేచి ఉండండి" అని ఆయన చెప్పడం ద్వారా తన ఉద్దేశాన్ని స్పష్టం చేశారు.